Pages - 60 - Rs. 10/-

# శివానంద భారతి

దివ్య జీవన ఆధ్యాత్మిక, సాంస్కృతిక మాసపత్రిక

శ్రీ విళంబి : - మార్గశిరం / పుష్యం

జనవరి : 2019

సంపుటి : 17 సంచిక - 3




స్వామి శివానంద



స్వామి చిదానంద




స్వామి దేవానంద



స్వామి సత్యవ్రతానంద



భారత గణతంత్ర దినోత్సవం
జనవరి 26



స్వామి వివేకానంద జయంతి
జనవరి 12




నేతాజీ జయంతి
జనవరి 23

ఏ.పి.డివైన్ లైఫ్ సొసైటి

శ్రీ శివానందాశ్రమం, పద్మారావునగర్, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం

*Spiritual Monthly Magazine :* **SIVANANDA BHARATHI**

**స్వామి చిదానంద ఉషోదయ ఉపన్యాసాలు**



# 25 అంతరంగంలో శాంతి

మన హృదయాల్లోనే కాదు శాంతి, ప్రపంచమంతటా శాంతి వ్యాపించాలని మనం ప్రార్థన చేద్దాం ! అందరిలో శాంతి సౌభ్రాతృదాష్ట్యలు వ్యాపించాలి ; జీవాలన్నిటినీ నిగూఢంగా శాంతితో వీక్షించాలి.

నిజానికి ప్రతి వ్యక్తి హృదయంలో నిగూఢంగా దైవశాంతి ఉంది. అది అనంతమైంది; అగాధమైంది. సత్యమైంది. ఈ శాంతినే ఆయా మతాల వారు వారి వారి దేవుళ్ల పేర్లతో పిలుచుకొంటారు. సర్వప్రాణుల్లోని హృదయాల్లో ఈశ్వరుడున్నాడు అన్న గీతాచార్యుల వాక్యం పరమార్థమిదే.

ఇదే మీ సహజ ప్రకృతి స్వభావం. నిత్య సత్యశాంతి ఏనాడూ తరిగేదికాదు. సత్యమైన ఈ శాంతి కాలాతీతం.

ఇవాళ ప్రపంచమంతా దౌర్జన్యం, పగ, బీభత్సం, ద్వేషం, శత్రుత్వం, యుద్ధోన్మాదం నిండి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో సర్వజీవుల్లోని ఈ పరమశాంతిని అంతటా ఎలా వర్తింపజేస్తామన్నదే పెద్ద సమస్య. మనకంటికి శాంతికి దూరమైన మనిషి కనిపిస్తున్నాడు. బయట కనిపించేవి మార్పు చెందుతాయి. అవి అనిత్యం. వాటివైపు వెళ్లడం వల్లనే శాంతి లభించడం లేదు.

లౌకిక వస్తులవల్ల శాంతి లభించదు. హృదయంలో మహా పెన్నిధిని నిర్లక్ష్యం చేస్తున్నాం. ఈ మహా సత్యాన్ని స్థిరపరచుకొందాం ! నిశ్చయ బుద్ధితో వ్యవహరిస్తే మనస్సు శాంతి పూర్ణమై ఉంటుంది.

మనిషి తనలోని దివ్యత్వాన్ని గ్రహించి, దాన్ని అనుభవిస్తూ, ప్రేమా, దయా, శాంతి, సౌజన్యం, సమతా, జ్ఞానం మొదలైన దివ్యగుణాల్ని తాను అనుభవపూర్వకంగా పెట్టుకొని వాటిని ఇతరులకు అందించాలి. ఇవి సుగుణాలు. ఇవి అందరిహక్కు. మీ హృదయంబులోనే ఈ ప్రశాంతత వ్యాపించి ఉంది. ఇదొక ఉద్యమంగా నిర్వహిస్తే ప్రజల అంతరాంతరాలతో శాంతిని నిర్మించ గలుగుతాం ! మూలంలోని ఈ ప్రశాంతతను విశ్వాంతరాళంలోనికి వెళ్లేట్లు చేద్దాం !

**సంగ్రహానుసరణ : ధర్మవీర**

# శివానంద భారతి

దివ్య జీవన ఆధ్యాత్మిక, సాంస్కృతిక మాసపత్రిక

## Sivananda Bharathi

Spiritual Monthly Magazine

Vol :17 Edition: 3 సంపుటి: 17 సంచిక: 03 శ్రీవిళంబి: మార్గశిరం పుష్యం జనవరి – 2019 January - 2019

బ్రహ్మలీనులు పరమపూజ్యులు, శ్రీ స్వామి శివానంద, శ్రీ స్వామి చిదానంద, శ్రీ స్వామి దేవానంద ఆశీస్సులతో

వ్యవస్థాపకులు :
**బ్రహ్మలీన స్వామి సత్యవ్రతానంద**

సంపాదకులు :
**ఆచార్య కసిరెడ్డి**

సహ సంపాదకులు :
**తిప్పరాజు కొండల్‌రావు**

సంపాదక మండలి :
**బొప్పన అరుణాదేవి**
**జి. సుధీర్‌కుమార్**
**డా॥ భేరీ సునీత**
**మరీచిక**

**శివానంద భారతి చందా వివరాలు.** సంవత్సరం చందా రూ.100/– శాశ్వత చందా రూ. 1100/–. సంవత్సర చందా కన్నా ఎక్కువ పంపరాదు. శాశ్వత చందా, పత్రిక నడచినంత కాలం అని గ్రహించగలరు.

## విషయసూచిక

| | |
|---|---|
| ఆత్మీయ భారతి – యోగా–ధ్యానం... – ఆశ్రమ కార్యవర్గం | 4 |
| సంపాదక భారతి – ఓ హిందూ మేలుకో ! – ఆచార్య కసిరెడ్డి | 5 |
| హిందూ ధర్మ సమగ్ర స్వరూపం – స్వామి శివానంద | 8 |
| భావ పరిణతి – మానవ జీవితం – స్వామి సర్వవిదానంద | 13 |
| శ్రీ రమణతత్త్వము – శ్రీమతి బొప్పన అరుణాదేవి | 17 |
| స్వామి శివానంద మహారాజ్..– అను. తిప్పరాజు కొండల్‌రావు | 20 |
| మహాత్ములు – సిలువేరు సుదర్శన్ | 23 |
| నేనే 'ఆది హిందువును' – డా॥ పి. భాస్కరయోగి | 24 |
| నాదబ్రహ్మం – డా॥ పర్యాద సరళ | 28 |
| అమృత వాక్కులు – వేదా చంద్రయ్య | 29 |
| భజన భారతి – శ్రీ కోడం మల్లయ్య | 30 |
| ప్రార్థన భారతి – ఆచార్య కసిరెడ్డి | 31 |
| జీవుడా మేలుకో ! – బ్రహ్మలీన శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి | 32 |
| నీవు నా తల్లివి – – మర్పల్లి రాంరెడ్డి | 34 |
| నారాయణీయం – శ్రీమతి హేమలతా బాలసుబ్రహ్మణ్యం | 35 |
| గురు పూర్ణిమ – ఆకుల రామయ్య | 39 |
| సంక్రాంతి చైతన్య క్రాంతి – ఆచార్య కసిరెడ్డి | 41 |
| శ్రీ చిదానంద అష్టోత్తర ..... – స్వామి శివానంద | 43 |
| *The Mahamantra Sankirtana Yoga*-Sri Chidananda | 45 |
| *Kumbakonam - A Sacred ........* - Sri Muthuraman | 50 |
| ధర్మం అమ్ముకొనే వస్తువు కాదు – ధర్మవీర | 52 |
| జననం – మరణం – శ్రీవత్స | 53 |
| ప్రకటన భారతి, వార్తా భారతి, విశేష భారతి | 54,55, 58 |

**ఆయా రచయితల అభిప్రాయాలు వారివే. ఆశ్రమ పత్రిక ఆలోచనా మాధ్యమం మాత్రమే.**

**ఆత్మీయ భారతి**

**సేవించు, ప్రేమించు,**
**ధ్యానించు-సాక్షాత్కారం పొందు**

**ధర్మం అంటే!**

**శ్లో॥ ధృతిః, క్షమా, దమో, అస్తేయం - శౌచమింద్రియ నిగ్రహః ।**
**ధీర్విద్యా సత్యమక్రోధో - దశకం ధర్మలక్షణమ్ ॥** (మనుస్మృతి)

తా॥ ధైర్యం, సహనం, నిగ్రహం, దొంగతనం చేయకుండడం, శుభ్రత, ఇంద్రియాదులకట్టడి, బుద్ధి, విద్యా, సత్యం, అక్రోధం ఈ పది ధర్మ లక్షణాలు.

**ధర్మపథం - భారతం**

**కం॥ ఒరులేయవి యొనరించిన - నరవర ! అప్రియము తన మనంబునకగు, తా**
**నొరులకు నవి సేయకునికి - పరాయణము పరమ ధర్మపథములకెల్లన్**

తా॥ ఇతరులు ఏది చేసినచో మన మనస్సునకు కష్టము కలుగునో, ఆ పని మనము ఇతరులకు చేయకూడదు. ధర్మమార్గములలో కెల్ల ఇదే గొప్పది. **- భారతం**

# యోగా - ధ్యానం - సత్సంగం ద్వారా వ్యక్తుల నిర్మాణం

అలనాడు ఆదిశంకరులు జ్ఞానం ద్వారానే పరమాత్మణ్ణి దర్శిస్తామని, అప్పుడు జీవాత్మ పరమాత్మ వేరుగా ఉండరనే సత్యాల్ని, అద్వైత వేదాంతం ద్వారా ఈ ప్రపంచానికందించారు. ఆ అద్వైత జ్ఞానం పొందాలంటే ఆలయాలు, ఆధ్యాత్మిక సంస్థలు, ఆశ్రమాలు, మఠాలు .... అన్నీ సత్సంగాలు నిర్వహించాలి. పురాణాలు, ఇతిహాసాలు, ధార్మిక గ్రంథాలు, స్తోత్రాలు, వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలకు సంబంధించిన అనేక విషయాలు చర్చింపబడాలి.

ఇంకా యోగా - ధ్యానం - జపం - తపం గురించి భారతీయ సనాతన ధర్మం చెప్పిన విషయాలు జనం దగ్గరికి వెళ్లేట్టు చేయాలి. ఆయా సంస్థల నిర్వాహకులు, స్వామిజీలు, ధర్మ ప్రచారకులు ఈ పనులు చేయడానికి హిందూ సమాజంలో ఉత్సాహాన్ని పెంచే ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. అప్పుడే భారతీయ తత్త్వ నిష్ఠా గరిష్ఠులైన వ్యక్తులు ఈ సమాజంలో నిర్మాణమవుతారు. ఈ విషయాల్లో వ్యక్తి చైతన్యమే సమాజ చైతన్యమని గురించి పనిచేయాల్సి ఉంది. పారమార్థిక భారతాన్ని నిర్మించాల్సి ఉంది.

ధన్యవాదాలతో . . .

**శ్రీ శివానందాశ్రమం**
పద్మారావునగర్, సికింద్రాబాద్
01-01-2019

భవదీయ
**ఆశ్రమ కార్యవర్గం**
**శివానంద భారతి, సంపాదక మండలి**

సంపాదక భారతి

# ఓ హిందూ మేలుకో !!

హిందువులు మూఢాచారాలు పాటించి, 2015 సెప్టెంబర్ గోదావరి పుష్కరాలలో ఒకే ముహూర్తానికి రాజమండ్రి దగ్గరి నదీ జలాలలో దిగి 29 మంది తొక్కిసలాటలో ప్రాణాలు పోగొట్టుకొన్నారు. ఇది మూఢాచారాలు పాటించడంవల్లనే జరిగింది.

అంటే 12 సం॥లకోసారి ఒక్కో నదికి వచ్చే 12 పుష్కరాలు 12 నదులుకు వస్తాయి. అలా ఏటా ఓ నదిలో ఆయా మేష, వృషభాది రాశుల్లో బృహస్పతి (జ్ఞానం) ప్రవేశిస్తాడు. అలా వరుసగా గంగ, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, తామ్రపర్ణి, సింధు, తుంగభద్ర, భీమా, ప్రణీత (ప్రాణహిత)కు వస్తాయి.

ప్రతి యేటా దేశంలోని ఒక్కో నదిలో ఒక్కో ప్రాంతంలో ఉన్న వారే కాక, వీలైన వాళ్లందరూ, దేశమంతటి నుండి విదేశాల నుండి వచ్చి 12 రోజులు స్నానాలు -దానాలు-పిండ ప్రదానాలు చేస్తారు. ఆ సం॥లోని చివరి 12 రోజులలో కూడా చేస్తారు. ఇలా చేసే హిందువులందరు మూఢులు కాబట్టే మూఢాచార పరాయణులని జననష్టానికి ముఖ్య కారణమని ఎంక్వయిరీ కమీషన్ వారు తేల్చేశారు.

## ఒక్కసారి ఆలోచించండి !

## పుష్కర ప్రయోజనాలు చూడండి !

పుష్కర స్నానాల్లో మత-కుల-వర్గ వర్గ భేదాలు లేవు. అందువల్ల **ఏకాత్మభావన** నిర్మాణమవుతుంది.

మేం అందరం ఒక్కటే అనే భావన నిర్మాణం కావడంవల్ల **సమాజ సంఘటన** ఏర్పడుతుంది. దానివల్ల **సంఘటిత** శక్తి సాధ్యమవుతుంది.

పుష్కరాలలోని వేదికల మీది నుండి పౌరాణిక విజ్ఞానం ప్రబోధిస్తారు. మన విజ్ఞాన శాస్త్రాలు పరిచయమవుతాయి.

నీళ్లలో వదిలే పిండాలు (అన్నం-పిండి) జలచరాలకు ఆహారంగా ఉపయోగపడతాయి.

నది పరిసరాల్లోని ఓషధీ వృక్షాలవల్ల ఆ నీళ్లు నిర్మలమవుతాయి.

నదీ పరిసరాల్లోని ఆలయాల చరిత్ర తెలుస్తుంది.

మనం దైవ సృష్టి - ధనం మానవ సృష్టి

దానం చేయడంవల్ల సేవాభావం పెరుగుతుంది. అన్నదానం, వస్త్రదానం, జ్ఞానదానం, సేవాదానం అందరం ఆచరించాల్సినవే అన్నారు స్వామి వివేకానంద.

హరికథలు, బుఱ్ఱకథలు, వినోద ప్రదర్శనలు కళాకారులకు తిండిపెడతాయి. చూచేవారికి వినోద విజ్ఞానాలనందిస్తాయి.

పుష్కరాల ద్వారా జాతీయ చైతన్యం ఏర్పడుతుంది. ఎన్నో వృత్తుల వారికి – ఫోటోలు, గుడారాలు, వేదికలు, బ్యానర్లు, మైకులు, బుట్ట బొమ్మలు, గారడీలు, చిట్కాలు, మందులు అమ్మేవారు) ఆదాయం లభిస్తుంది.

పుష్కరాలను అధ్యయనం చేసేటప్పుడు పై అంశాలతో పాటు కర్మకాండ, పౌరాణిక, ఆధ్యాత్మిక, చారిత్రక–భౌగోళిక, సాంస్కృతిక, సాంప్రదాయిక, కౌటుంబిక, సామాజిక, జాతీయ దృక్పథాలను పరిగణనలోకి తీసుకొంటే కమీషన్ ఇంత దౌర్భాగ్యపూర్ణమైన నివేదిక ఇచ్చేదికాదు. కమీషన్లు హిందూమానసం గాయపడ్డా సరే మేం ఇచ్చేది ఇస్తాం, చేసేదేంటో చేసుకోండి అన్నట్లే !

## ఓ హిందూ మేలుకో !

తొలి రోజు మొదటి ఘంటలో స్నానంచేస్తేనే ఫలితం వస్తుందని చెప్పిందెవరు ? ఆ సమయంలో భక్తులనెందుకు రానివ్వలేదు. వారినెందుకు కట్టడి చేశారు. అంతమందివస్తే వారికి సరియైన సౌకర్యాలెందుకు కల్గించలేదు. ఆ ఘాటువైపు జనం రాకుండా వేరే ఘాట్లకు ఎందుకు మళ్లించలేదు. భద్రతా సిబ్బంది విఫలం అవడానికి కారణాలేమిటి ? అన్నిటికీ హిందువుల మూఢ విశ్వాసాలే కారణమా !

## ఓ హిందూ మేలుకో !

అందుకే ఓ హిందూ మేలుకో అని పిలుపు ఇవ్వాల్సి వస్తుంది.

నాస్తికులు, జనవిజ్ఞాన వేదికలవారు, అన్ని రకాల కమ్యూనిస్టులు, అడవుల్లోని నక్సలైట్లు, మేధావులుగా పిలువబడే అర్బన్ నక్సలైట్లు, కులవాదులు, పాకిస్థాన్ భక్తులు, చైనాభక్తులు, అన్ని రకాల ఉగ్రవాదులు, జీహాదీలు, క్రూసేడీయులు, మతమార్పిళ్లవాళ్లు, విదేశీ కొమ్ముగాసే ఎన్‌జీవో సంస్థలు, హిందూ సన్యాసుల వేషంలో ఉండి ఆశ్రమాలు నడిపిస్తున్న వారు, ఐఎస్ఐఎస్ ఉచ్చులో పడి దేశవిద్రోహక కార్యకలాపాల్లో పాల్గొన్నవారు, ఎప్పుడూ హిందూ పురాణాల్ని వక్రభాష్యంచేసే రచయితలు, హిందూ ధర్మంలోని మతాల్ని తిట్టిపోసేవారు,

**త్యాగము అదృష్టమునకు ఆధారము**

హిందూ దేవుళ్ల విగ్రహాల్ని అపవిత్రంచేసే వారు..... ఇలా ఎందరో, ఎన్ని సంస్థలో వ్యతిరేకించడం స్పష్టంగా కనిపిస్తుంది. హిందుత్వ శక్తితో వీటికి బుద్ధి చెప్పాల్సి ఉంది. హిందుత్వంలోని ఔన్నత్యాన్ని గుర్తించేట్టు చేయాల్సి ఉంది.

పెద్దలు, యువతరానికి, బాలబాలికలకు హిందూత్వంలోని గొప్పతనాన్ని తెలియజేయండి! హిందూదేశ–ధర్మ–జాతి–సంస్కృతుల పరిరక్షణకు పూనుకొన్న వీరులను గూర్చి, ఆచార్యులను గూర్చి, వారి త్యాగ శౌర్యాల గూర్చి వివరించండి ! సంఘటిత శక్తిని నిర్మాణం చేయండి ! చాలు హిందుత్వం నిలుస్తుంది.

**– ఆచార్య కసిరెడ్డి**
**98669 56250**

**మంచి పనులు చేసేవారిని 'మహనీయులు' అంటారు, సమాజ సేవకు జీవితాన్ని సమర్పించిన వారిని 'మహాత్ములు' అంటారు.**

★ ★ ★

**తక్కువ సంపదలు, తక్కువ కోరికలు కలిగిన వ్యక్తి, ఎక్కువ సంపదలు ఎక్కువ కోరికలతో సతమతమయ్యే వ్యక్తి కంటే ధనవంతుడు**

★ ★ ★

**మెప్పించటం కోసం, గుర్తింపు కోసం, హోదా కోసం, పేరు ప్రతిష్ఠల కోసం చేసే పనులను సేవ అనరు. సేవ అంటే స్వార్థ రహితము.**

ధర్మము యొక్క నిజమైన అర్థం "ధారణ" (ఆచరణ)

# హిందూ ధర్మ సమగ్ర స్వరూపం
# (ALL ABOUT HINDUISM)

## ఆరో అధ్యాయం

*(గత సంచిక తరువాయి)*

## హిందూ ఆచారాలు

**- శ్రీ స్వామి శివానంద**

## శాస్త్రాలు నిర్దేశించిన దశ సంస్కారాలు

మానవుడి జీవితంలో వుండే వివిధదశలకు సంబంధించిన కర్మలనే సంస్కారాలంటారు. ప్రతి హిందువు జీవితంలో పవిత్రత కలిగించే పరిశుద్ధమైన కర్మలే సంస్కారాలు. ఒక వ్యక్తిజీవితంలో జననంనుంచి మరణంవరకు వచ్చే ముఖ్యమైన సంఘటనలకు ఆధ్యాత్మిక స్పర్శను కలుగజేస్తాయి సంస్కారాలు. మానవ జీవితంలోని ముఖ్యదశలను గుర్తుచేస్తాయి సంస్కారాలు. ఒక చిత్రపు ఆకారం రంగులు నింపడంవల్ల ఎంత తేజోవంతమవుతుందో, అదేవిధంగా ఆధ్యాత్మికసంస్కారాలు బ్రాహ్మణ్యానికి వన్నె చేకూరుస్తాయి.

పసితనంలో, బాల్యావస్థలో, యవ్వనంలో, వృద్ధాప్యంలో, మరణదశలో నిర్వహించే వేరు వేరు సంస్కారాలుంటాయి. మొత్తం ఏభై రెండు సంస్కారాలున్నాయి. వీటిలో పది సంస్కారాలు ముఖ్యమైనవి. అవి గర్భాదానం, పుంసవనం, సీమంతోన్నయనం, జాతకర్మ, నామకరణం, అన్నప్రాశనం, చూడాకర్మ, ఉపనయనం, సమావర్తనం, వివాహం. ఈ సంస్కారాలలో కొన్ని మాత్రమే ఆచరణలో వున్నాయి. ఇందులో కొన్ని సంస్కారాలు పసితనం, బాల్యావస్థకు సంబంధించినవి. కొన్ని కర్మలు ప్రతి నిత్యం చేయాల్సినవి, మరికొన్ని ప్రత్యేక సందర్భాలలో చేయాల్సినవి. ప్రతి హిందువు జీవితం ఊయల నుండి శ్మశానం వరకు ఈ వైదికకర్మలవల్ల పవిత్రత, రక్షణ పొందుతుంది.

## గర్భాదానం

గర్భాదానం సృష్టి కార్యాన్ని పావనం చేస్తుంది. తనకు పసిపాపను ప్రసాదించమని హృదయ పూర్వకంగా వేడుకుంటాడు భర్త. ఋతుశాంతి (శోభనం) సమయంలో పవిత్ర

**పేరు ప్రతిష్టల త్యాగమే గొప్ప త్యాగము**

మంత్రాలను పఠిస్తాడు. ఈ మంత్రాల తరంగాల ప్రభావం వల్ల గర్భాధారణ జరుగుతుంది. ఆ అండంలోని మెదడు కణాలలో మంచి ముద్రలు పడతాయి. స్వచ్ఛమైన బుద్ధి, అర్థం చేసుకునే శక్తి వున్న నిజమైన హిందువుకు స్త్రీ సంగమం శారీరక ఆనందానికి మాత్రమే కాదు. తన దివ్యమైన సృజన శక్తిని, ప్రాణశక్తిని ఒక మానవరూపధారణకు ఉపయోగిస్తాడు. భార్యాభర్తలిద్దరు రతి సమయంలో ఉల్లాసంగానూ, దైవభక్తితోనూ వుండాలి. వారి మనస్సు అల్లకల్లోలంగా, ఆందోళనకరంగా వున్నా, కోపం కాని ద్వేషం కాని కలిగి వున్నా రతి కార్యంలో పాల్గొనకూడదు. వారు పవిత్ర గ్రంథాలను చదవాలి. అర్జునుడి రూపాన్ని తలిస్తే పరాక్రమవంతులైన కొడుకు, బుద్ధుని రూపం తలిస్తే దయ, క్షమలాంటి సద్గుణాలు వుండే కుమారుడు, ధన్వంతరిని తలిస్తే గొప్ప ఆయుర్వేద వైద్యుడిగా రూపొందే కుమారుడు, సూర్యభగవానుణ్ణి తలిస్తే తేజోవంతమైన వర్చస్సు వుండే శిశువు జన్మిస్తారు.

## పుంసవనం

పుంసవన కార్యక్రమం మంత్రోక్తంగా మూడవ మాసంలో చేస్తారు. అప్పటికి శిశువుకు అన్నమయకోశం, ప్రాణమయకోశం ఏర్పడతాయి.

## సీమంతోన్నయనం

సీమంతోన్నయనం గర్భందాల్చిన తర్వాత ఏడవ నెలలో వేదమంత్ర పఠనంతో చేస్తారు. సంస్కారంవల్ల తల్లికి దుష్టశక్తుల నుంచి రక్షణ కల్గుతుంది. శిశువుకు మంచి ఆరోగ్యం కల్గుతుంది. పైన తెలిపిన మూడుసంస్కారాలు తల్లిని, శిశువును రక్షిస్తాయి. శిశువుశరీరం బాగా అభివృద్ధి చెందుతుంది.

## జాతకర్మ

శిశువు జన్మించిన తర్వాత జరిపే తరువాతి సంస్కారమే జాతకర్మ. అప్పుడే జన్మనెత్తిన శిశువుకు ఆ శిశువు తండ్రి స్వాగతం పలుకుతాడు. ఆ శిశువు దీర్ఘాయువు కోసం, బుద్ధి కుశలత కొరకు, ఆరోగ్యంకోసం ఎన్నో ప్రార్థనలు చేసి ఆ శిశువుకు తేనె, వెన్న తినిపిస్తాడు.

## నామకరణం

ఆ తర్వాత వచ్చే సంస్కారం నామకరణం. శిశువు జన్మించిన పదవ, పదకొండో లేదా పన్నెండోరోజు మంత్రాలను పఠిస్తూ నామకరణం చేస్తారు.

మంచి ఆలోచనలు తరగని సంపదలు

## అన్నప్రాశన

అన్నప్రాశన ఆరవమాసంలో జరుగుతుంది. వండిన ఆహారం తినిపిస్తారు. మంత్రోచ్చారణలతో వివిధ దేవతలకు నివేదనలనర్పిస్తారు. ఈ సంస్కారాల నిర్వహణలో భాగంగా జరిగే శ్రావ్యమైన వేదమంత్ర పఠనంవల్ల కలిగే ఆధ్యాత్మికతరంగాల ప్రభావంవల్ల శిశువు శరీరం అందంగా తేజోవంతంగా అభివృద్ధి చెందుతుంది.

## చూడాకర్మ

శిశువు జన్మనెత్తిన మొదటి సంవత్సరంలో కాని, మూడవ సంవత్సరంలోకాని చూడకర్మ చేస్తారు. శిశువు తలవెంట్రుకలు తీసివేస్తారు. ఐదవ సంవత్సరంలో కాని, ఏడవ సంవత్సరంలో కాని, చూడకర్మ చేసిన సంవత్సరం తర్వాత కాని కరవేధ చేస్తారు. అంటే శిశువు చెవులకు రంధ్రం చేస్తారు. ఈ సంస్కారాల వల్ల శిశువు శరీరం సౌష్టవంగా అభివృద్ధి చెందుతుంది, దుష్టశక్తుల నుంచి రక్షణ లభిస్తుంది. శుక్లంవల్ల కాని, అండం వల్ల కాని ఆనువంశికంగా వచ్చే శారీరక, మానసిక వైకల్యాలు రావు. విద్యారంభం లేదా అక్షరాభ్యాసం చేస్తారు. ఇవన్నీ బాల్యదశలో నిర్వహించే సంస్కారాలు.

## ఉపనయనం

మానవుడి జీవితంలోని యౌవన దశకు నాంది పలికే అతి ముఖ్యమైన సంస్కారం ఉపనయనం, బాలుడి జీవితంలో ఒక మైలు రాయి. అతడి రెండవ జన్మ, ఆధ్యాత్మిక జన్మ. ఉపనయనం అన్న పదానికి అర్థం “దగ్గరకు తీసుకురావడం”. బాలుణ్ణి అతడి ఆధ్యాత్మికగురువు దగ్గరకు తీసుకెళ్తారు. గురువు అతడికి పవిత్రమైన యజ్ఞోపవీత ధారణ చేసి, గాయత్రీమంత్రోపదేశం చేసి, దండం అందిస్తాడు. ఇది సంపూర్ణ బ్రహ్మచర్యం పాటించే బ్రహ్మచర్యఆశ్రమానికి ప్రారంభం. గాయత్రీ మంత్రోపదేశంవల్ల ద్విజుడు, రెండవసారి జన్మ ఎత్తిన వాడవుతాడు. తల్లిదండ్రులు తమ పరస్పర కోరికవల్ల అతడికి జన్మనిస్తారు. ఇది శారీరకజన్మ మాత్రమే. గాయత్రీమంత్రోపదేశం తర్వాత వచ్చేది నిజమైన రెండవ జన్మ. యాజ్ఞవల్క్య మహర్షి ప్రకారం బ్రాహ్మణుడికి ఎనిమిది సంవత్సరాల వయస్సులో, క్షత్రియుడికి పదకొండుసంవత్సరాల వయస్సులో, వైశ్యుడికి పన్నెండు సంవత్సరాల వయస్సులో ఉపనయన సంస్కారం చేయాలి. బ్రాహ్మణుడికి ఐదవ ఏట, క్షత్రియుడికి ఆరవ ఏట, వైశ్యుడికి ఎనిమిదవ ఏట ఉపనయనం చేయాలని మనుస్మృతి తెలియజేసింది.

**మంచి పనులు వెంటనే చేయి, కాలం నీకోసం ఆగదు**

## యజ్ఞోపవీతం ప్రాధాన్యత

అతిపవిత్రమైన యజ్ఞోపవీతానికి ఒక ముడి వుండే మూడు దారాలు వుంటాయి. యజ్ఞోపవీతం ధరించినవాడికి మనస్సు, వాక్కు, శరీరంపై – ఆలోచన మాట, కర్మలపై సంపూర్ణనియంత్రణ వుండాలి. ఈ పవిత్రమైన ఉపవీతం ప్రపంచంలోని ఎన్నో త్రయాలను సూచిస్తుంది – సత్, చిత్, ఆనందం ; సృష్టి, స్థితి, లయలు జాగ్రద్, స్వప్న, సుషుప్త్యావస్థలు; సత్వం, రజస్సు, తమోగుణాలు ; త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. ప్రతి విద్యార్థి తన ఆలోచనలు, మాటలు, కర్మలపై నియంత్రణ వుండాలని దండం సూచిస్తుంది. వీటిపై నియంత్రణ కలిగి మనసా, వాచా, కర్మణా బ్రహ్మచర్యం పాటించేవారు సంపూర్ణత్వాన్ని పొందుతారు. ఉపనయనసంస్కారం పొందిన విద్యార్థి పసుపుపచ్చ వర్ణం వుండే కౌపీనం, నడుముచుట్టూ మూడు వరుసలుగా ముంజిత్రాడు ధరిస్తాడు. గురువు అతడికి జింకచర్మం అందజేస్తాడు. పసుపుపచ్చ కొత్తవస్త్రం నూతనశరీరానికి ప్రతీక. పసుపురంగు ఆధ్యాత్మికతను తెలియజేస్తుంది. కౌపీన ధారణ, ఆ విద్యార్థి సంపూర్ణ బ్రహ్మచర్యం పాటిస్తూ స్వచ్ఛమైన జీవనం గడపాలని సూచిస్తుంది. నడుముచుట్టూ మూడుసార్లు చుట్టిన ముంజిత్రాడు ఆ విద్యార్థి సంహితలు, బ్రాహ్మణాలు, ఉపనిషత్తులు అధ్యయనం చేయాలని తెలియజేస్తుంది. జింక చర్మం అతడు మున్ముందు గడిపే తాపస జీవనానికి ప్రతీక.

## సమావర్తనం

ఆ తర్వాత విద్యార్థి దశ పూర్తవుతుంది. వేదాధ్యయనం, విద్యార్థి దశవ్రతాలను పూర్తిచేసుకున్న తర్వాత గురువు గారికి గురు దక్షిణ సమర్పించుకొని పవిత్ర స్నానం చేయడానికి అనుజ్ఞ తీసుకుంటాడు. దాంతో అతడి విద్యార్థి దశ ముగుస్తుంది. గురువు గారి ఆజ్ఞ తీసుకొని తన స్వగృహానికి తిరిగి వస్తాడు. ఇంటికి తిరిగివచ్చిన తర్వాత సమావర్తన సంస్కారం చేస్తాడు, ఇదే ఇంటికి తిరిగివచ్చే కార్యక్రమం. అతను ఇప్పుడు వివాహం చేసుకొని గృహస్థాశ్రమ స్వీకరణకు అర్హుడు.

### వివాహం

వివాహంతో గృహస్థాశ్రమంలో ప్రవేశిస్తాడు. అతడిప్పుడు యజ్ఞయాగాదుల ద్వారా, గ్రంథాధ్యయనం ద్వారా, వంశోద్ధారణ ద్వారా ఆధ్యాత్మిక ఋణాలను తీర్చుకుంటాడు. పెళ్ళికుమారుడు, పెళ్ళికుమార్తె చెయ్యి పట్టుకొని "నాకు అదృష్టం కలగాలని నీ పాణి గ్రహణం చేస్తున్నాను" అంటాడు. చేయి చేయి కలుపుకొని అగ్ని చుట్టు ప్రదక్షిణం చేస్తాడు. పెళ్ళికూతురు అగ్నిదేవుడికి ధాన్యాలను సమర్పించి "నా భర్త చిరకాలం జీవించాలి, మా సంబంధాలు అభివృద్ధి చెందాలి" అని ప్రార్థిస్తుంది.

**సమయాన్ని సఫలం చేసుకునే వారు వివేకవంతులు**

## జీవితంలో చివరి రెండు దశలు

జీవితంలో మరో రెండు దశలున్నాయి. వానప్రస్థం, సన్యాసం. ఈ రెండు దశలకు కూడా వాటి వాటి సంబంధిత ఆచారాలున్నాయి. మనిషి అన్ని లౌకికకార్య క్రమాల నుంచి విరమించుకొని అరణ్యాలకు వెళ్ళి సన్యాస ఆశ్రమం స్వీకరించడానికి సంసిద్ధుడౌతాడు. ఈ జీవనమే వానప్రస్థం. సన్యాసి లోకాన్ని త్యజించి, అధ్యయనం, ధ్యానం చేస్తూ భిక్షాటనమీద జీవిస్తూ తన జీవనం గడుపుతాడు. మనిషి మరణించిన తర్వాత అతని కుమారుడు కాని వారసుడు కాని జరిపే కర్మే ప్రేతకర్మ.

## పంచ మహాయజ్ఞాలు

ప్రతి గృహస్థు ప్రతినిత్యం ఆచరించాల్సిన ముఖ్యమైన యజ్ఞాలు ఐదు. అవి:

**1) బ్రహ్మయజ్ఞం – దీన్ని వేదయజ్ఞం అని కూడా పిలుస్తారు. బ్రాహ్మణులకు లేదా వేదాలకు లేదా మునులకు చేయాల్సిన యజ్ఞం బ్రహ్మ యజ్ఞం.**

**2) దేవయజ్ఞం – దేవతల కొరకు చేయాల్సిన యజ్ఞం.**

**3) పితృయజ్ఞం – పితృ దేవతలకు చేయాల్సిన యజ్ఞం.**

**4) భూతయజ్ఞం – జీవులన్నింటి పట్ల చేయాల్సిన యజ్ఞం.**

**5) మనుష్యయజ్ఞం – మానవులకు చేయాల్సిన యజ్ఞం.**

ఈ పంచ యజ్ఞాల నిర్వహణ మానవుడి అభివృద్ధికి, ఆధ్యాత్మిక వికాసానికి ఎంతో సహకరిస్తుంది. తనకు ప్రత్యేకమైన అస్థిత్వం లేదని, తాను వేరే జీవికాని, వేరే కొలమానం కాని కాదని, తాను గొప్ప సంపూర్ణంలోని అంశ మాత్రమేనని క్రమక్రమంగా అర్థం చేసుకుంటాడు. గొప్ప గొప్ప ఋషులు రచించిన శాస్త్రాలను అధ్యయనం చేసి జ్ఞానం సంపాదించు కుంటాడు. తన స్నేహితుల నుంచి, బంధువుల నుంచి, సహచరుల నుంచి సహాయం పొందుతాడు. అతడి తల్లి దండ్రులు అతడికి భౌతిక కాయాన్ని ఇచ్చారు. ఈ శరీర పోషణ ఆవుపాలతో, ధాన్యపుగింజలతో, కూరగాయలతో, ఫలాలతో జరుగుతున్నది. పంచభూతాలు అతడికి సహాయం చేస్తాయి. గాలి, నీరు లేందే అతడు జీవించలేడు. దేవతలు, పితృదేవతలు అతణ్ణి ఆశీర్వదిస్తారు. అతడు ప్రకృతికి ఐదు రెట్లు ఋణపడి వుంటాడు. అందుకే పంచమహా యజ్ఞాలను నిర్వహించి ఆ ఋణం తీర్చుకోవాలి. ఇంకా అతడు నడుస్తున్నప్పుడు, ఊడుస్తు న్నప్పుడు, వంటచేస్తున్న సమయాల్లో ఎన్నో చిన్న చిన్న క్రిమికీటకాదులు నశించి పోతాయి. ఈ యజ్ఞాల నిర్వహణవల్ల ఆ పాపపరిహారమవుతుంది.

*(సశేషం)*

**మనసుని అణచకు, మార్చుకో**

# భావ పరిణతి

## ప్రసాదించేవాడు

మూలం : స్వామి దయానంద సరస్వతి సేకరణ : స్వామి సర్వవిదానంద

*(గత సంచిక తరువాయి)*

### ఈశ్వరుడినర్థం చేసుకోవాలి - విశ్వసించటం కాదు :

ఈశ్వరుడు విశ్వాస విషయం కాదు. అర్థం చేసుకోవలసిన విషయం. ఈ లోకాన్ని నీవు చూస్తున్నావు కాబట్టి అది విశ్వసించే విషయం కాదు. కనుక ఈశ్వరుడు కూడా విశ్వసించే విషయం కాదు. అతడినర్థం చేసుకోవటమొక సవాలు. భగవానుడు స్వర్గంలో ఉంటే – నీ ప్రత్యక్షానుమానాల పరిధి కందకపోతే అప్పుడతడు విశ్వాసానికి విషయమవుతాడు. ఆ పక్షంలో ప్రశ్నలడగకకుండా నీకు చెప్పిందాన్నంగీకరిస్తావు. కానీ హిందువుల భగవానుడు విశ్వాసానికొక విషయం కాదు. హిందువులు భగవానుని కేవలం విశ్వసించరు. వారతడినర్థం చేసుకుంటారు.

హిందువు లాకాశాన్ని పూజించటానికదే కారణం. దక్షిణ భారతంలో చిదంబర క్షేత్రంలో నట రాజస్వామి కంకితమయిన ఆలయ మొకటుంది. ఆ దేవాలయంలో చిదంబర రహస్యమొకటుంది. 'చిత్' అంటే సర్వజ్ఞుడైన పరమేశ్వరుడు, అంబరమంటే ఆకాశం. కనుక ఆ దేవాలయంలో ఆకాశాన్నే ఈశ్వరుడుగా పూజిస్తారు. చిన్నకుఱ్ఱవానిగా ఆలయానికి మొట్టమొదట నేను వెళ్ళినప్పుడు ఆ రహస్యమేదో తెలుసుకోవాలని కుతూహలంగా ఆత్రంగా ఉన్నాను. ఆరతిచ్చే సమయమాసన్నమయింది. పూజారి తెర తీశాడు. ఆత్రంగా చూశాను. అక్కడ విగ్రహంగానీ, ఆకారంగానీ ఏమీ కనపడలేదు. అక్కడ కనిపించిందల్లా బంగారపు బిల్వ పత్రాలతో చేసిన హారమొకటి ఆకాశంలో వ్రేలాడుతూ ఉన్నది. కనుక రహస్యమేమిటంటే ఆకాశమే ఈశ్వరుడు అదే విధంగా మరో ఆలయంలో అగ్ని, మరోచోట జలము, పృథివి. ఒక వైదికుడు మాత్రమే పంచభూతములను – ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూములను – ఈశ్వరునిగా పూజించగలడు. అదీ వేదముల దృష్టి.

**విజయాన్ని ధనంతో కొనలేము - నిరంతర కృషితో సాధించగలము**

**ఈశ్వరునారాధించటానికొక ప్రత్యేకమైన పీఠము, విగ్రహము నీకవసరం లేదు. ఎక్కడైనా నీవారాధించవచ్చు. ఎందుకంటే, ఈశ్వరుడు కానిదేమున్నది ? సమస్త నియతి ఈశ్వరుడే – సర్వ నియమాలు ఈవ్వరుడే. పరిణతి పొందిన వ్యక్తి విషయంలో భగవానుని శ్రద్ధా ఆదరములతో చూడటమంటే అదే.**

పరిణతి అంటే ఉన్న దానిని అవగతితో ఆదరించగలగడం వాస్తవిక దృష్టి కలిగి ఉండటం. సత్యాన్ని సత్యంగా అంగీకరించి జీవించటం. ఉన్నవిలేవనుకోం. మనం ఉన్న వాస్తవాల గురించి చర్చిస్తున్నాం. కాబట్టి విశ్వసించటమ్న ప్రసక్తి లేదు. బంగారం రాగి కంటే భిన్నమని, అది మరో లోహంకంటే భిన్నమని గుర్తించగలం. ఎందుకంటే ప్రతి లోహానికి దాని దాని విశిష్ట ధర్మములు, అణుభారం మొదలగువి ఉన్నవి. కానీ ఒక భౌతిక శాస్త్రవేత్తకు తెలుసు. అవన్నీ శక్తి తప్ప అన్యం కాదని. అది విశ్వాసం కాదు. నేనది చూడటం లేదనెవరైనా అంటే ఆ వ్యక్తి నమ్మాల్సి ఉంటుంది. కానీ ఆ నమ్మకం దేవుడు స్వర్గంలో ఉన్నాడనే నమ్మకం లాంటిది కాదు. అటువంటి నమ్మకమయితే జీవితాంతం ఆ నమ్మకంతోనే ఉండాలి. దానితోనే మరణించాలి. కానీ ఈ విషయంలో మనకున్నది శ్రద్ధ. శ్రద్ధ అంటే కనుగొనే ముందుండే నమ్మకం. మనం చర్చిస్తున్న విషయము అర్థం చేసుకోవలసినది. మనం భేదం చూస్తాం, అదే సమయంలో అభేదాన్ని – మన కళ్ళకు కనపడదానికంటే అధికమైన దాన్ని అర్థం చేసుకుంటాం. వేదముల దృష్టి అది. చరాచర సృష్టి సమస్తం ఈశ్వరుని కంటే భిన్నం కాదు. అతడే నిమిత్త కారణము, ఉపాదాన కారణం కూడా.

నిమిత్తకారణ దృష్ట్యా ఈశ్వరుని 'అతడు' అని ఉపాదాన కారణ దృష్ట్యా 'ఆమె' అని సంబోధిస్తుంటారు. నిజానికి 'అతడు', 'ఆమె' పదాలు తరచుగా ఒకదానికొకటి మార్చి గూడ వ్యవహరిస్తుంటాము. ఇద్దరి పరతత్త్వం చెప్పేటప్పుడు 'అది' అని వాడుతుంటాము.

ఈశ్వరుడే సర్వము – సర్వ నామములు సర్వ రూపములు అతడే కనుక అతడినే నామముతోనైనా, ఏ రూపములోనైనా ఆరాధించవచ్చు. ఇదీ ఈశ్వరారాధానను పరిపక్వ దృష్టితో చూడటం. ఈశ్వరునే భాషలోనైనా ప్రార్థించవచ్చు. అతడు సర్వజ్ఞుడు అన్ని భాషలు అతడికి తెలుసు. నిజానికతడు మనం పిలవక పూర్వమే ప్రతిస్పందించాలి. ఇది సహించటం, అనుకోవటం లాంటివి కాదు. అవగతం చేసుకోవటం. హిందువులు వివిధ రకాల ఆరాధానలపట్ల సహనశీలురంటుంటారు. మనం సహన శీలురమే, సందేహం లేదు. కానీ ఇప్పటి విషయంలో కేవలం సహన శీలురం మాత్రమే కాదు. పూజ, ప్రార్థన, ఆరాధన వరకు మనకేమీ అబ్యంతరం లేదు. ఏ విధమైన పూజ ప్రార్థన అయినా మనకి పూర్ణ

**మధుర స్వభావులే మహానుభావులు**

అంగీకారమే. అందుచేతనే అధికంగా మన పూజ గదుల్లో అనేక మంది దేవతలను చూస్తుంటాము. ఈశ్వరుని ప్రతి అంశానికి ప్రతి రూపముంటుంది కూడా. సూర్యుని భగవానుడుగా చూస్తాం. కనుక సూర్యదేవుడుంటాడు. అగ్నిని దైవంగా చూస్తాం. కనుక అగ్నిదేవుడుంటాడు. భూమిని దేవతగా చూస్తాం. భూదేవత ప్రతిమ ఉంటుందక్కడ. ఇలాగే వివిధ దేవతలు. నిమిత్త కారణాన్ని మనం పూజిస్తుంటాం. ఉపాదాన కారణమందుకు ప్రతీక అవుతున్నది.

ఉపాదానాన్ని ప్రతీకగా చేసుకొని సర్వజ్ఞుని సర్వేశ్వరుని ఆరాధిస్తుంటాము. సూర్యుడు, చంద్రుడు మొదలగునవన్నీ ప్రతీకలు. వీటి ద్వారా మనమా ఈశ్వరరునారాధిస్తుంటాము.

## భగవానుడు మాత్రమే :

"భగవానుడొక్కడే" అని కూడా మన మనం. "భగవానుడు మాత్రమే" అనంటాం. భగవానుడొక్కడే అని నీవంటే దానినర్థం నీవు భగవానునికంటే భిన్నమని, అతడెక్కడో స్వర్గంలోనో మరో లోకంలోనో ఉన్నాడనర్థం. ఈశ్వరుడు నీ కంటే భిన్నమయితే అతడు నిన్ను కలుపుకున్న వాడు కాదు. అంటే అతడి శక్తిలో నీ శక్తి అంతర్గతంకాదు. ఇంకా, ఈశ్వరుడు నీ కంటే భిన్నమయితే, నా కంటే కూడా అతడు భిన్నమే, సమస్త జీవరాశికంటే అతడు భిన్నం. అంటే నీ శక్తి, నా శక్తి, దేవతల శక్తి, చిన్న దేవతల శక్తి, ఈగ, దోమల శక్తి, క్రిముల శక్తి ఇవన్నీ ఈశ్వరుని శక్తికంటే భిన్నం – అంతర్గతం కాదు. అప్పుడతడు శక్తిమంతుడవుతాడు గానీ, సర్వశక్తి మంతుడు కానేరడు. అప్పుడీశ్వరుడు మామయ్యలాంటి వాడవుతాడు. మా మామయ్య కూడా బలవంతుడే. కానీ ఎంత శక్తిమంతుడైనా పరిమితులకు లోబడే ఉంటాడు. శక్తిమంతుడైన అమెరికా అధ్యక్షునికి కూడా దోమల బెడద తప్పదు. అతడికీ అంటు వ్యాధులు సోకే ప్రమాదముంది. అదే విధంగా ఈశ్వరుడు కూడ పరిమితులకు లోబడే ఉండాల్సి వస్తుంది.

కనుక అర్థం చేసుకోండి. ఒక్కడే భగవానుడని కాదు. కేవలం భగవానుడే, భగవానుడు మాత్రమే. కనుక ఎవరైనా 'అల్లా' అని ప్రార్థిస్తే అది సంగతమే. ఎవరైనా అతడిని 'జీసస్' అని ప్రార్థిస్తే అదీ సముచితమే. మనకెటువంటి సమస్య లేదు. భగవానుని వివిధ నామరూపాలతో పూజించుట మెవరికైనా రుచించకపోతే అది అతడి/ఆమె సమస్య. మనకెటువంటి సమస్యాలేదు. మనకనేకమంది దేవతల్లేరు. వాస్తవానికి మనకు ఒకే ఈశ్వరుడు కూడ లేడు. మనకు కేవలం ఈశ్వరుడు మాత్రమే ఉన్నాడు.

భగవానుని ఒకే నామంతో/ఒకే రూపంతో ప్రార్థించాలనే వారు కొందరున్నారు. నేకొకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. కిటికీ ప్రక్కగా కూర్చున్నాను. మరో వ్యక్తి ఎదుటి బర్త్

**మంచితనాన్ని మించిన సంపద లేదు**

మీద కిటికీ వైపుగా కూర్చొనున్నాడు. అతడొక పుస్తకం చదువుతున్నాడు. అదే పెట్టెలో మూడవ ప్రయాణికుడు, ఈ వ్యక్తి గ్రంథం చదవటం గమనిస్తున్నాడు. కొంతసేపటి తరువాత అతడీ వ్యక్తి నడిగాడు –

"ఏం చదువుతున్నారు?"

"గీతను చదువుతున్నాను" ఈ వ్యక్తి సమాధానిమిచ్చాడు.

"గీత అంటే ఏమిటి?"

"అది హిందువుల శాస్త్ర గ్రంథం".

"ఈ శాస్త్రాన్నెవరిచ్చారు?"

"కృష్ణభగవానుడు".

"ఓ ! కృష్ణుడు దేవుడా?"

"అవును. కృష్ణుడు భగవానుడు".

"మరి రాముడి విషయమేమిటి?"

"రాముడు కూడా దేవుడే".

"మరి నారాయణుడు?"

"అతడు కూడా దేవుడే".

"గణేశుడు మాటేమిటి?"

"గణేశుడు కూడా దేవుడే".

"మీకెంత మంది దేవతలున్నారు? మీ కయోమయం – మోహం కలగటం లేదా;"

"నాకేమీ అయోమయం లేదు. అందరి దేవతల చిత్రాలు నా పూజ గదిలో ఉన్నాయి. అందరికీ నేనారతి చూపుతాను. వారందరూ సంతోషిస్తున్నారు. నన్ననుగ్రహిస్తున్నారు. నాకేమీ మోహము, సందిగ్ధము లేదు".

"అయోమయంలో పడకుండా ఎలా ఉంటావు? ఇంతమంది దేవతలతో నీకయోమయం– మొహం కలిగే ఉండాలి!" నొక్కి నొక్కి అన్నాడతను. తాను చెప్పేది నిరూపించటానికితడొక కథ చెప్పటమారంభించాడు. కథ చెప్తూ మధ్య మధ్యలో నన్ను చూస్తున్నాడు. అతడు చెప్పేది నేను వింటున్నానన్నది నిర్ధారించుకోవటం కోసం. కథ ఇలా సాగింది –

*(సశేషం)*

**సేవించకు మద్యం - జీవితాన్ని చేయునది ఛిద్రం**

# శ్రీ రమణతత్త్వము

*(గత సంచిక తరువాయి)*

- శ్రీమతి బొప్పన అరుణాదేవి

శ్రీ శంకరుల వివేక చూడామణిని తమిళములోనికి అనువదించి శ్రీరమణులు దానికొక ఉపోద్ఘాతము వ్రాసినారు.

ప్రపంచంలో ప్రతి జీవి శోకం పొడయేలేని సుఖాన్ని కోరుకుంటాడు. అసహజమైన రుగ్మతలను పోగొట్టుకోగోరుతాడు. ప్రతివాడూ సర్వాతిశయంగా ప్రేమిస్తాడు. అందులో ఆనందం లేకుంటే ఆ ప్రేమ సాధ్యమే కాదు. ఏదియు లేని గాఢనిద్రలో తాను సుఖమున్నానని భావిస్తాడు. కాని ఆనందమే రూపుగొన్న నిజస్వరూపం సరిగా తెలియనందున, ఆనందానికి ఋజువైన మార్గాన్ని వదలి, సంసారములో తట్టుమిట్టాడుతున్నాడు. ఆనందమంటే ఇహపరభోగాలేనని వాని భ్రాంతి.

## భద్ర మార్గము

కాని దుఃఖచ్ఛాయపడని ఆనందానుభూతి వానికి కరువౌతున్నది. ఆనందానికి ఋజుమార్గం చూపడానికే పరమశివుడు శంకరాచార్యులై వేదాంతంలో ప్రస్థాన త్రయానికి భాష్యం వ్రాశారు. అందు ఆనందాతిశయాన్ని కీర్తించారు. దానికి ఆయన జీవితమే ప్రమాణము. వానిని అధ్యయనం చేసే శక్తి చాలక మోక్షానందాన్ని శ్రద్ధగా అతివేలంగా వాంఛించే పలువురికి ప్రస్థాన త్రయ భాష్యము అక్కరకు రావటంలేదు.

అట్టి వారికై శంకరులు ప్రస్థాన త్రయసారాన్ని ఈ చిన్న గ్రంథం 'వివేకచూడామణి'లో నిబంధించారు. ముముక్షువులకు యోగ్యాలైన సకలాంశాలూ ఇందు వివరించి, సరియైనదీ, సూటియైన మార్గాన్ని వారికి నిర్దేశించారు.

## పాండిత్యం మాత్రమే చాలదు

మానవ జన్మ అతి దుర్లభమనీ, అది లభించిన ప్రతి జీవి తనకు సహజమైన మోక్షానందానుభూతికై యత్నించి తీరవలెనని శ్రీ శంకరులు తమ బోధ ప్రారంభిస్తారు.

**ఎక్కువ కోరికలే సమస్యలకు మూలం**

కైవల్యం జ్ఞానమొక్కదాని వల్లనే. జ్ఞానం విచార సాధ్యం, ఈ విచార మార్గం తెలియడానికి గురు ప్రసాదం ఆవశ్యకం అంటారు శంకరులు. గురుశిష్యుల అర్హతానర్హతలూ, గురువు నెడల శిష్యుడు నెఱపవలసిన వినయసేవాదులు వివరించారు. మోక్షానందానుభవానికై శిష్యుని స్వప్రయత్నం అత్యంతావశ్యకమని శ్రీ శంకరులు నొక్కి చెప్పారు. గ్రంథాధ్యయన మాత్రన ఈ ఆనందం లభించదు. దానికి విచారమే గతి. విచార మార్గంలో మూడు దశలు 1) శ్రవణం – గురూపదేశాల యెడల భక్తి శ్రద్ధలూ 2) మననము – దీర్ఘచింతనము 3) నిధి ధ్యాసము – ఆత్మ సంస్థితిని అలవరచుకోవటం.

## మూడు మార్గాలు

స్థూల, సూక్ష్మ, కారణ దేహాలు మూడు అనాత్మయే, కనుక మిథ్యలే. ఆత్మ (నేను) వానికి పూర్తిగా భిన్నమైనది. అజ్ఞానంవల్ల ఆత్మ భావన (నేనన్న తలపు) అనాత్మకారోపింపబడినది. బంధమంటే నిజంగా ఇదే. అజ్ఞానం వలన బంధం కనుక, జ్ఞానం విమోచన కారణం కావలె. గురువువల్ల దీనిని తెలియడమే శ్రవణము.

## మననము

ఈ శరీర త్రయాన్ని, పంచకోశాలను అనాత్మగా నిరాకరిస్తుంది. కుశాగ్ర సూక్ష్మమైన విచారంవల్ల ఆత్మ యీ మూడు శరీరాలకు భిన్నమనీ, అది ఏకాగ్రమూ, సర్వాత్మకమును అయి, హృదయంలో అహంస్ఫురణగా వెలసియున్నదనే 'తత్త్వమసి' యన్న శ్రుతి వాక్యంలోని 'త్వమ్' ఈ అహంస్ఫూర్తియే అని నిర్ధారిస్తుంది.

## కైవల్యము

నామరూపాత్మకమైన జగత్తు సత్ లేక బ్రహ్మమునకు లక్షణము. అది బ్రహ్మమునకు వేరు కాదు కనుక దానిని ప్రత్యేకంగా 'తత్త్వమసి' అన్న మహా వాక్యం గురువు శిష్యునికి చేసే బోధ, ఉపదేశము. ఆ తరువాత శిష్యుని 'అహం బ్రహ్మ' అను స్థితిలో నిలకడగా ఉండుమని ఆదేశం. కాని మనోవాసనలు ఎంతకూ ఆగక మొలకెత్తి మరల మరల గాఢంగా, దృఢంగా క్రమ్మి అతణ్ని భంగపెడతాయి. ఈ వాసనలు మూడు విధాలు. వాని మూలమైన అహంకరణ, రజోగుణాధిష్ఠితమైన విక్షేపము, తమోగుణ విశిష్టమైన ఆవరణము, కారణములుగ వెలువడి సవికల్పంగా నిలుస్తుంది.

**అసాధ్యాన్ని సుసాధ్యం చేయుటయే ఉత్తమ లక్షణం**

## మనోమథనము

వాసనలంతరించు వరకు, మనస్సును దృఢంగా హృదయంలో నెలకొల్పి, చెదరని సడలని జాగరూకతతో, ఆత్మకు విశిష్ట లక్షణమయిన యథార్థ జ్ఞానాన్ని ఉన్మీలించుట నిధిధ్యాసనము లేక ఆత్మానుసంధానము. దానిని తెలుపునవే 'అహం బ్రహ్మాస్మి', 'బ్రహ్మైవాహం' అన్న మహావాక్యాలు. దీనినే భక్తియని, ధ్యానమనీ వర్ణిస్తారు.

ఆత్మానుసంధానాన్ని వెన్నకై పెరుగును చిలుకుటతో పోలుస్తారు. మనస్సు కవ్వము, హృదయము పెరుగు, ఏకాగ్రత నభ్యసించటము, చిలకటము, పెరుగు తరిచి వెన్నతీసినట్లు, రాపిడివల్ల అగ్ని లేచినట్లు, నిశ్చలమూ అవహితమూ అయిన ఆత్మ ధ్యానమువల్ల, స్రోతస్సమమైన తైలధారవలె సహజమూ, నిర్వికారమూ అయిన నిర్వికల్ప సమాధి ఉద్భవిస్తుంది. అందుండి సద్యమూ, సరళమూ, అనాంతకమూ, విశ్వాత్మకమూ అయిన బ్రహ్మము దృశ్యమానమవును. ఆ బ్రహ్మము ఏకకాలమందే జ్ఞానమూ, అనుభవమూ, దేశకాలతీతము.

## నిరవధిక సుఖము

ఆత్మానుభవ మట్టిది. దానివల్ల హృదయగ్రంథి తెగిపోతుంది. ఆ ముడికి కారణాలైన చిరకాలానుగతములైన దుష్ట వాసనలూ అజ్ఞాన జనిత భ్రాంతులూ నష్టమవుతాయి. సంశయములు నశించి, కర్మ బంధము తెగిపోతుంది.

శ్రీ శంకరులు ఈ రీతిగా తమ వివేక చూడామణిలో నిస్సీమమూ, నిస్సంశయమూ, నిర్ద్వంద్వమూ, నిరవధి సుఖము అయిన నిర్వికల్ప సమాధిని వర్ణించి తోడ్తోనే దాని సాధనావిధానాల్ని సైతం వివరించారు. ద్వంద్వ భావన నుండి తప్పి బయటపడటమే జీవిత పరమార్థము. దాన్ని సాధించి నాతడే జీవన్ముక్తుడు గాని, పురుషార్థముల గూర్చి పుస్తకమాత్ర పరిచితి గలవాడు కాదు.

## మోక్షము

ఇట్లు జీవన్ముక్తునికి సంచిత, ఆగామి, ప్రారబ్ధ కర్మ బంధములు ఉండవు. ఈ స్థితిని అందుకొన్న శిష్యుడు తన అనుభవమును వివరిస్తాడు. ముక్తుడు యథేచ్ఛ వర్తించవచ్చు. నశ్వరమైన దేహాన్నీ వీడగానే, అతనికి విదేహ కైవల్యము లభిస్తుంది. అటుపై జీవన్మృత దశ ఆయనకుండదు.

ఇట్లు శ్రీ శంకరులు ఆత్మసాక్షాత్కారము రెండు విధములంటారు. జీవన్ముక్తి మరియు విదేహముక్తి. గురుశిష్య సంవాద రూపములో వ్రాసిన ఈ చిన్ని గ్రంథంలో మరెన్నో విషయాలను కూడా చర్చించారు. ✶

**సహనం సముద్రం కన్నా పెద్దది**

# స్వామి శివానంద మహారాజ్ వారి విశిష్ట వ్యక్తిత్వం

ఆంగ్లమూలం : శ్రీ యన్. అనంత నారాయణన్ స్వేచ్ఛానువాదం : తిప్పరాజు కొండల్‌రావు

స్వామి శివానంద మహారాజ్ వారికి వివిధ రంగాలలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆధునిక భారతీయ ఆధ్యాత్మిక గగనంలో ఒక ధృవతారగా వెలిగిన విశిష్ట వ్యక్తి గురుదేవులు. శారీక సౌష్టవంలో బౌద్ధిక సామర్థంలో, ఆధ్యాత్మిక ఔన్నత్యంలో వారికి సాటి ఎవరూ లేరు. వారికి వారే సాటి. ప్రపంచంలో వివిధ దేశాలలో అసంఖ్యాకమైన వ్యక్తుల జీవితాలను ప్రభావితం చేయడం వారి వ్యక్తిత్వంలోని ముఖ్య లక్షణం. అయితే వీరి ప్రభావం ధర్మం, మతం, తెగ, భాష, దేశం, లింగభేదం, రాజకీయ విధానాలకు అతీతంగా ఉంటుంది. బహుశః ఇరవైయవ శతాబ్దిలో ప్రపంచ వ్యాప్తంగా వేలాది శిష్యులతో స్వామి శివానంద వారికిగల వ్యక్తిగత సంబంధం మరో ఆధ్యాత్మిక వేత్తకు లేదు.

రెండు మార్లు తాత్కాలిక ప్రధానిగా పదవిని చేపట్టిన శ్రీ గుల్జారీలాల్ నందాగారు గురుదేవుల గురించి ఈ విధ:గా ప్రశంసించారు. “మన భారత దేశంలోని గొప్ప ఆధ్యాత్మిక వేత్తల చరిత్రలో స్వామి శివానందులవారి పేరు అత్యున్నత స్థానంలో ఉంటుంది”.

మలయాలో ఆధునిక జీవితాన్ని స్వయంగా, కనులారా తిలకించిన స్వామీజీ మానవ జీవితంలోని సుఖ దుఃఖాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. వారి దుఃఖాలలో, బాధలలో, కష్టాలలో స్వయంగా పాలుపంచుకున్నారు. అందరి మన్నలు పొందిన స్వామి శివానంద వారి వాక్కులపట్ల బోధనలపట్ల ఒక ప్రత్యేక గౌరవం లభించింది.

భగవత్స్వరూపుడైన స్వామిజీ జీవితంలో సాధన, సేవ ; బోధన, ఆచరణ – విడదీయరాని బంధాన్ని ఏర్పర్చుకున్నాయి. కర్మాచరణ, ఆరాధన సామరస్య భావనకు ఆధారంగా నిలచాయి. ఇంతే కాకుండా స్వామి శివానంద వారి సన్యాస జీవితానికి పూర్వాశ్రమ జీవితానికి ఒక విడదీయరాని సూత్రం ఉంది. విశ్వప్రేమ నిస్వార్థసేవ – ఇదే ఆ అమూల్యమైన బంగారు సూత్రం. అనేక సంవత్సరాలపాటు తీక్షణమైన తపస్సుచేసి, జీవితంలో ఎన్నో కష్టాలను, అవరోధాలను ఎదురుకొని మానవ జీవితానికి అంతిమలక్ష్మమైన భగవత్సాక్షారం సాధించిన

**ఆవేశపూర్వక నిర్ణయాలు అనర్థాలను తెస్తాయి**

తర్వాత తాను మాత్రమే ఆ బ్రహ్మానందాన్ని అనుభవించాల్సిన ఏకాంత జీవనం కోరుకోలేదు. ఆధ్యాత్మిక జీవన స్రవంతిలో ఓలలాడింపచేసే ఆ పరమానందాన్ని ఆస్వాదించాలని అందరినీ ఆహ్వానించారు. అందరికీ పంచారు.

స్వామి శివానంద వారు మానవ సమాజంలో మతం, భగవంతుని పట్ల ఉన్న మూఢ నమ్మకాలను పటాపంచలు చేశారు. అదే విధంగా యోగా, యోగీల ఆధునిక కట్టుకథలను బట్టబయలు చేశారు. తమ బోధనల ద్వారా తమ వ్యక్తిగత ఆచరణల ద్వారా భగవత్సాక్షాత్కారానికి, మోక్షసాధనకు తీవ్రమైన సాధన, తపస్సు తప్ప మరో దగ్గరి దారిలేదని తేల్చి చెప్పారు. లౌకిక భోగాలకు ఇంద్రియ సుఖాలకు దూరంగా, ఎన్నుకున్న గురువుపై అమితమైన విశ్వాసంతో కఠినతరమైన సాధనయే పరమాత్మ దరికి చేర్చే ఏకైక మార్గం అని బోధించారు. నిస్వార్థ సేవ, ప్రేమ ; సాధుజీవనం, ధ్యానం ; దయ, విచక్షణ – ఇవే అమృతత్వానికి సోపానం అని ఋజువు చేశారు.

స్వామి శివానందుల వారి జీవనం ఉత్తేజకరంకాదు, స్ఫూర్తిదాయకం. ఆధ్యాత్మిక సాధకులకు ఎన్నో పాఠాలను నేర్పే జీవనం. వారిని తిరుచురాపల్లిలో తంజావూరులో విద్యార్థిగా చూసినా, సెరెంబమ్, జోహ్రూ, బహ్రూలో డాక్టరుగా గమనించినా ; వింధ్యప్రాంతంలో వారి ఏకాంత ప్రయాణంలో వెంబడించినా ; స్వర్గాశ్రమంలో వారి కఠినమైన తపశ్చర్యను తిలకించినా, వారి జీవనయానం మానవాళికి వారు అందించిన నిస్వార్థ సేవలను స్మరించినా; వారు ఒక అత్యున్నతమైన ఆధ్యాత్మిక గురువుగా దర్శనమిస్తారు. వారి జీవితం ఒకే మార్గాన్ని సూచిస్తుంది. అంతులేని నిస్వార్థసేవ, అపరిమితమైన ప్రేమ దానిలోనే భగవంతుణ్ణి చేరే ఏకైక మార్గం ఉంది. వారు రచించిన గ్రంథాలలోని సందేశాల ఆవశ్యకత మనకు ఇక్కడ అగుపడుతుంది.

స్వామి శివానంద ఒక ప్రత్యేకమైన హిందూ సన్యాసి. శిరోముండనం చేసుకొన్న తల ఒక వైపు, చలికాలంలో పాశ్చాత్య దేశం ఉన్ని కోటు ధారణ మరోవైపు. వారు మూర్తీభవించిన భారతీయుడు. ఆంగ్ల భాషలో గ్రంథాలు రచించేవారు. సాంప్రదాయక నిష్ఠగల బ్రాహ్మణ కుటుంబంలో జన్మనెత్తినా అంటరాని వారిని దరిజేర్చుకునేవారు. వారు స్వయంగా తీవ్రమైన తపస్సు ఆచరించేవారు. అయినా తమ శిష్యులను తమ శరీరాన్ని కాపాడుకొనమని బోధించేవారు. వారు తమ గురువుగారి వద్ద కొద్దికాలం మాత్రమే ఉన్నారు. కాని తమ కఠిన తపశ్చర్యతో అనూహ్యమైన విధంగా భగవత్‌సాక్షాత్కారం సాధించారు. ఎలాంటి ఆర్థిక

**ఆవేశం వివేకాన్ని నశింప చేస్తుంది**

బడ్జెట్ లేకుండా ఆశ్రమాన్ని నడిపారు. ఎలాంటి ప్రత్యేక సిలబస్ లేకుండా ఆశ్రమాన్ని నడిపారు. ఎలాంటి ప్రత్యేక సిలబస్ లేకుండా వేలాది మంది శిష్యులకు ఆధ్యాత్మిక శిక్షణనిచ్చారు. మూడు దశాబ్దాల పాటు గంగానదికి జలగలా అంటి పెట్టుకుని ఉన్నారు, కాని వారి జీవిత కాలంలో వారి పేరు ప్రఖ్యాతులు, గౌరవం ప్రపంచమంతా వ్యాపించింది. వారు ప్రత్యక్షంగా ఎలాటి అద్భుతాలు ప్రదర్శించలేదు. అయినా ప్రపంచ వ్యాప్తంగా వారి భక్తులు అందరూ గురుదేవుల కటాక్షంవల్ల తమ తమ జీవితాల్లో ఎన్నో అద్భుతాలు జరిగాయని ప్రశంసించారు.

స్వామి శివానందుల వారు 1963లో తమ శరీరాన్ని వదలివేశారు. అయినా వారి పేరు ప్రఖ్యాతులు, వారి రచనల ప్రాముఖ్యత దినదినాభివృద్ధి చెందుతున్నాయి. ఇదొక అద్భుతమైన కథ. స్వామి శివానంద కథ. అధ్యయనంచేసి, జ్ఞాపకం ఉంచుకోవాల్సిన కథ. కాద, కాదు వారిలా జీవించాల్సిన కథ.

ఆధ్యాత్మిక రంగంలో ప్రఖ్యాతి పొందిన యోగి. "ఒక యోగి ఆత్మకథ" అన్న ప్రఖ్యాతిగన్న గ్రంథం రచయిత పరమహంస యోగానంద, స్వామి శివానంద వారికి ఈ క్రింది పదాలలో తమ నివాళులనందించారు.

"స్వామి శివానందుల వారి జీవితం నిస్వార్థసేవకు ఒక గొప్ప ఉదాహరణ. వారు తమ ఉనికి ద్వారా భారతదేశాన్ని, సమస్త ప్రపంచాన్ని పునీతం చేస్తారు, ఆశీస్సులందిస్తారు".

✶

## పురాణ లక్షణం

**శ్లో॥ సర్గశ్చ ప్రతి సర్గశ్చ వంశో మన్వంత రాణి చ ।**
**వంశాను చరితం చైవ పురాణం పంచ లక్షణమ్॥**

పురాణం అంటే పాతదే అయినా చెబుతున్నా కొద్ది కొత్తదనం గోచరిస్తుంది. సర్గము, ప్రతి సర్గము, వంశము, మన్వంతరము, వంశాను చరితం అనే పంచ లక్షణాలు కలిగినదే పురాణం.

– వేదా చంద్రయ్య

మనకు అవసరాలు గుర్తున్నంతగా సామర్థ్యాలు గుర్తుండవు

# మహాత్ములు

- సిలువేరు సుదర్శన్

ఆత్మజ్ఞానం పొందినవారు ఆత్మ స్వరూపులగుదురు. ఇట్టివారు నిరతిశయానందము నొందుదురు. వారు మరణ కాలమునందు దుఃఖించరు. వారికి మరల జన్మయుండదు. పంచభూతాత్మకమైన కన్నులు నశించిపోయే వస్తువులను మాత్రమే. చూడగలుగుతాము. సమస్త ప్రాణులలో అంతర్యామిగా వెలిగే పరమాత్మను ఎవరు దర్శింతురో, వారే నిజమైన నేత్రములు కలవారు. సమస్త జీవులలో ప్రకాశించు పరమాత్మను చూచువాడే తనను తాను యదార్థముగా ఉద్ధరించుకొన్న వాడగును. ఆకాశములో అనేక రంగులతో కూడిన మేఘములు, ఉఱుములు, మెరుపులు సంచారం చేయుచున్నను, ఆకాశము, స్వచ్ఛమై, నిశ్చలమై నిలిచియుండును. అట్లే జ్ఞానిలోకంను విడిచియుండకపోయినను, లోకమునందున్న దుఃఖాది ద్వంద్వములచే అంటుబడక యుండును. తానే పరమాత్మయని, పరమాత్మయే తానని, సుఖ-దుఃఖ-మోహాదులతో కూడిన ప్రాకృతిక వికారములు మాయయని ఎవరు తెలుసుకొందురో, అట్టివారు పరప్రాణులకు ఉపకార కార్యములను చేయుచున్నను, లేక నిరంతము ధ్యాన నిష్ఠయందున్నను అట్టివారు మహాత్ములని గ్రహింపవలయును. "నేను" అను అహంకారము నశించునంతవరకే "అహంబ్రహ్మాస్మి" అను వాక్యమును అనుసంధానము చేయుట జరుగును. అహంకార-మమకారములు నశించినట్టి జ్ఞాని అట్లు అనుసంధానము చేయకున్నను, బ్రహ్మానుభవము పొంది అందరిచే పూజింపబడుచుండును.

దీపము చేతి యందున్నప్పుడు చీకటిని ఉండుమన్నా ఉండునా ? అట్లే జీవేశ్వర జగదాదులు అసత్యమని తెలిసిన జ్ఞాని యొక్క సన్నిధికి మాయ రమ్ము అనినా వచ్చునా? బలిసిన పశువైన పులి ఎదుట పడుటకు జంకునట్లు, దృఢమైన జ్ఞానము వలన పూర్ణుడైన జ్ఞాని యొక్క సన్నిధికి విషయవాసనలు రాజాలవు. మట్టిచే రూపొందిన కుండ మట్టియే యగునట్లు, ప్రకృతి వలన రూపొందినట్టి శరీరము ప్రకృతియే యగును. అజ్ఞానమువలన సంకల్పాలు, వాటివలన కోరికలు (వాసనలు) వాటి వలన ప్రాకృతిక శరీరము ఏర్పడుచున్నది. ఈ శరీరముతో తనకెలాటి సంబంధములేదని జ్ఞాని తెలుసుకుంటాడు. దేహాత్మ బుద్ధి గల

**ఆనందం వస్తువులలో ఉండదు - మనసులో ఉంటుంది**

లోకులు "జ్ఞాని కూడా మరణించుచున్నాడ"ని అనుకొందురు. కాని శరీరము పడిపోవునప్పుడు కూడా జ్ఞాని తనయందే తాను నిలచి జనన-మరణములకు అతీతుడైయుండును. భగవద్దర్శనము సిద్ధించినప్పుడు, లేక ప్రకృతి యొక్క ఆవరణము తొలగినప్పుడు కొందరు భక్తులు, గొప్ప ధనవంతులు, అధికారులు చేయజాలని మహాకార్యములను చేయుదురు. ఆ శక్తి వారికి భగంతుని నుండి సమకూరును. అట్టి మహాత్ములపై విశ్వాసమునుంచిన వారు తరించుటకవకాశముండును. నిజమునకు మనుష్యులందరున్నూ ఋషి సంతానములే! కాలాంతరమున సత్యమును బోధించువారు లేక గొఱ్ఱెల గుంపువలె దిక్కులేని వారైరి. ఇట్టి జనులకు ధర్మ బోధ చేయుటకే దివ్య పురుషులు అవతరించి, వారిని ఉద్ధరింతురు. మాయ నుండి ఏ సహాయము లేకుండా విడివడుట మానవునికి సాధ్యమా ? సంసారము మాయా విలాసమని, దైవమొక నిత్యమని గుర్తించిన మహాత్ములు ఇతరులు కూడా ముక్తి నొందుటకై గాఢ తపమొనర్చి, ఫలితమును మానవ జాతికి ధారపోయుచుందురు. అట్టి గురుదేవుని శరణు పొందిన వారి ప్రారబ్ధ కర్మలు నశించును. ఈ బ్రహ్మాండమంతా మాయా అను జ్ఞానముకల మహాత్ముడు లభించుట దుర్లభము. మిక్కిలి దుర్లభము. తల్లి ఋణము, తండ్రి ఋణము, విద్య నేర్పిన గురువు ఋణమును తీర్చవచ్చును. కాని మన నిజమైన స్వరూపమును తెలిపిన సద్గురువు యొక్క ఋణమును తీర్చలేము. తీర్చజాలము. ✶

**నాలో మనసు ఉంది, మమత ఉంది, మానవత్వమూ ఉంది, విశాల హృదయమూ ఉంది, అయినా అన్నిటికీ మించి అహంకారం ఉంది అందుకే నేను మామూలు మనిషిగానే మిగిలిపోయాను.**

✶ ✶ ✶

**కోరికలు తీరేందుకు, పనులు అయ్యేందుకు, దైవాన్ని కొలిచే భక్తి - నిజమైన భక్తి కాదు. మనసును దైవమందు నిలపటానికి చేసే ప్రయత్నమే భక్తి.**

ముఖస్తుతి నచ్చే వారికి ఉత్తుత్తి మాటలతోనే కడుపు నిండుతుంది

# నేనే 'ఆది హిందువును'

**- డా॥ పి. భాస్కరయోగి**

నిమ్న, శూద్రకులాల వారిని వైదికులుగా మార్చిన సంస్థ ఆర్య సమాజం. స్వామి దయానంద ప్రేరణతో ఆనాటి యువకులెందరో భారత స్వాతంత్ర్య ఉద్యమాల్లో, సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఈ రెండు ఉద్యమాల్లో తన భాగస్వామ్యం నెరపి పేరెన్నికగన్న సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ.

1882 మే 22న రంగమాంబ, వెంకయ్య దంపతులకు రెండవ సంతానంగా భాగ్యరెడ్డి వర్మ జన్మించారు. తల్లిదండ్రులు ఆయనకు పెట్టిన పేరు భాగ్యయ్య. 1888లో వీరి కులగురువు ఈ బాలుని పేరు భాగ్యరెడ్డిగా మార్చడం జరిగింది. చిన్నతనంలోనే తండ్రి మరణించడంవల్ల తల్లి ఎంతో కష్టంతో సంసార భారం నెట్టుకొచ్చింది. ఓ రోజు తల్లిమందలింపుతో ఇల్లు విడచి వెళ్లిపోయాడు భాగ్యరెడ్డి వర్మ. ఆ తర్వాత చదువుకొని ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు.

భాగ్యరెడ్డి వర్మ 1906లో 'జగన్మిత్ర మండలి' స్థాపించి, దాని ద్వారా బాలబాలికల విద్య, దేవదాసీ వ్యవస్థ నిర్మూలన వంటి కార్యక్రమాలను చేపట్టాడు. దళిత ఆళ్వారు నందనారులా మద్యమాంసాలను వదలిపెట్టాలని ఈ సంస్థ ద్వారా ప్రచారం చేశారు. ఆయన లక్ష్మీదేవమ్మ అనే బ్రాహ్మణ కులస్థురాలిని కులాంతర వివాహం చేసుకొని ఆనాటి సమాజానికి ఆదర్శంగా నిలబడ్డారు. 1910లో దళితకులంలో ధార్మిక, నైతిక చైతన్యం కోసం 'ప్రచారిణీ' అనే సంఘం ప్రారంభించారు. దళిత విద్యార్థుల చదువుకోసం 1910లో ఇసామియాబజారు (నేటి చాదర్‌ఘట్)లో జగన్మిత్ర మండలిని ఆధారం చేసుకొని 7 పాఠశాలలు ప్రారంభించి, అచిరకాలంలోనే 26 పాఠశాలలుగా చేశాడు. 1012లో అహింసా సమాజం, 1913లో వైదిక ధర్మ ప్రచారినీ సభ స్థాపించారు. బాజీ కృష్ణారావు అనే ఆర్యసమాజం పండితుడు భాగ్యరెడ్డి వర్మకు యజ్ఞోపవీతం ధరింపజేసి, 'వర్మ' అనే నామాన్ని పేరుకు అదనంగా చేర్చడంలో ఆనాటి నుండి వారిని 'భాగ్యరెడ్డి వర్మ' అనిపిలిచాడు.

భాగ్యరెడ్డి వర్మ గొప్ప జాతీయవాది, అంతేగాక గాంధీ, అంబేద్కర్‌ల కన్న ముందే దళితసమాజం ఉద్ధరణకు కృషి చేసి జాతీయ స్థాయిలో పేరొందాడు. బ్రహ్మసమాజ

**అసూయగల హృదయం అశాంతికి నిలయం**

సిద్ధాంతాలను కూడా ఆకళింపుచేసుకొన్న వర్మ అనేక సంస్థల్లో నిర్విరామంగా పనిచేశారు. ముఖ్యంగా దళితసమాజ ఉద్ధరణకు భాగ్యరెడ్డివర్మ చేసిన కృషి అనన్య సామాన్యం. 1917 నవంబర్ 4 - నుండి 6వ తేదీవరకు విజయవాడలో 'ఆంధ్రప్రాంత ప్రథమ పంచములు సదస్సు' (ఆదిహిందూ సదస్సు) కు ఆయన అధ్యక్షత వహించారు. "ఈ దేశంలో పంచములే ఆదిహిందువులనీ, వారే ఈ దేశపు మూలవాసులనీ, ముఖ్యవారసులని" వర్మ గారు ఘంటాపథ:గా ఆ సభల్లో పేర్కొన్నారు.

ఆ సభల విజయానికి ఆనాటి రాజకీయ, సామాజిక ప్రముఖులెందరో కృషి చేశారు. 1917 డిసెంబర్ 15న కలకత్తాలో 'అఖిల భారతహిందూ సంస్కరణ సభ'లో గాంధీజీ ఉన్నప్పుడు భాగ్యరెడ్డి వర్మ చేసిన ప్రసంగం అద్భుతం. ఆనాటి దళిత సమస్యలను జాతీయ స్థాయి మేధావుల దృష్టిలోకి వెళ్లడానికి ఆనాటి వర్మ ప్రసంగం ఎంతో కీలకంగా పనిచేసింది. ఆ సభల్లోనే వారికి గాంధీజీతో బాగా దగ్గరితనం ఏర్పడింది. అదే సమయంలో రవీంద్రనాథ్ ఠాగూర్‌తో సమావేశమయ్యారు.

1918 డిసెంబర్ 31న ప్రారంభమైన 'ది పంచమ' అనే ఆంగ్లపత్రికకు భాగ్యరెడ్డి వర్మ వెన్నుదన్నుగా నిల్చారు. పేదదళిత వర్గాల సేవకోసం 1912లో 'స్వస్తిదళ్' అనే సంస్థను వర్మ ప్రారంభించారు. ఆదిహిందువుల్లో ఐక్యతకోసం బుడగ జంగములు. .... వంటి కులాల మధ్య సమన్వయం కోసం 1919లో 'ఆదిహిందూ వైష్ణవ సమ్మేనం', 1931లో 'ఆదిహిందూధార్మిక సమ్మేళనం' జరిపించారు. 1932లో '9వ జాతీయ నిమ్నజాతి మహాసభ'లో జరుగబోయే రెండవరౌండ్ టేబులో సమావేశంలో 7 కోట్ల మంది అస్పృశ్యుల సమస్యల పరిష్కారానికి డా॥ అంబేడ్కర్‌ను ప్రతినిధిగా నియమించాలని నిర్ణయిస్తూ తీర్మానం చేశారు వర్మగారు.

1930లో జరిగిన 'ప్రథమాంధ్ర మహాసభల్లో వెట్టిచాకిరీ, అస్పృశ్యులకు వ్యతిరేకంగా తీర్మానం చేయించారు భాగ్యరెడ్డివర్మ.

1929లో జరిగిన 'ఆదిహిందూ భవన ప్రాంగణానికి వచ్చి గాంధీజీ భాగ్యరెడ్డి వర్మ కృషిని అభినందించారు. రమణమహర్షి సమకాలికుడై భారతదేశంలోనే గొప్ప సంస్కృత పండితుడిగా పేరొందిన క్యావకంఠ గణపతిమునిని భాగ్యరెడ్డివర్మ 1927లో హైదరాబాద్ రప్పించి, కాంగ్రెస్ సభల్లో దళిత సమస్యలు, అస్పృశ్యతపై గొప్పగా మాట్లాడిన కావ్యకంఠ గణపతిని అభినందించడానికి ఏర్పాటు చేసిన సభ చాలా విశిష్టమైంది. కావ్యకంఠ గణపతికి

**ఔన్నత్యం సంపదవల్ల కాదు, సద్గుణాల వల్ల వస్తుంది**

‘ముని’ బిరుదును ప్రదానం చేసింది భాగ్యరెడ్డి వర్మనే. ఆరోజు గొప్ప ఊరేగింపు జరిపించారు. 1913లో భాగ్యరెడ్డి వర్మ బుద్ధ జయంతి కూడా గొప్పగా జరపడం విశేషంగా చెప్పవచ్చు.

ఆర్య సమాజంవల్ల ప్రభావితులైన త్రయం భాగ్యరెడ్డి వర్మ, మంగూరామ్, అచ్యుతానందలు పంజాబ్, ఆంధ్ర, ఉత్తరప్రదేశ్‌ల్లో జరిపిన ఆది హిందూ ఉద్యమాలు విజయవంతగా జరిగాయి. తెలుగు ప్రాంతాల్లో దళిత చైతన్య స్ఫూర్తిగానిల్చిన భాగ్యరెడ్డి వర్మను ఆనాడు గొప్ప దళితనాయకుడుగా అని అందరూ పిలవడం జరిగింది.

భాగ్యరెడ్డి వర్మ సభలు, సమావేశాల ద్వారా దళిత క్రాంతికి కృషి చేశారు. ‘హిందూమతం మూలవారసులు’ అనే నినాదం ఆనాటి మేధావులు చాల ప్రభావితం చేసింది. అరెగి రామస్వామి, బియస్ వెంకట్రావు, బాలముకుంద్ అనే (క్షత్రియ కులస్థుడు) జడ్జ్ ఆయనకు వెన్నుదన్నుగా నిలిచారు.

హిందూ మతం వదలిపెట్టి హిందూత్వాన్ని నిందించకుండా అందులో ఉండి సంస్కరణల కోసం ప్రయత్నించిన గొప్ప మేధావి. ✶

## బాగా గుర్తు పెట్టుకో

**ఈ లోకం ఎప్పుడైనా మంచివాడిని మంచివాడు అనదు.**
**మంచివాడుగా నటించే వాడిని మాత్రమే మంచివాడు అంటుంది.**

✶ ✶ ✶

**సాయం చేయటానికి వయసుతో పనిలేదు, డబ్బుతో పనిలేదు. నీకున్న దానిలో కొంచెం ఇతరులకు పెట్టడం నేర్చుకో, తీసుకోవడం కంటే ఇవ్వడంలో ఎంతో ఆనందం సంతృప్తి ఉంటుందనేది తెలుస్తుంది.**

– వేదా చంద్రయ్య

కల్లాకపటం లేని నవ్వే ఉత్తమ ఔషధం

# నాదబ్రహ్మం

- డా॥ పర్యాద సరళ

సీ॥ ఓంకారమేతొల్త నొకరాగమై వెల్గె
నాదబ్రహ్మమనగ నవ్యసృష్టి
వేదాలు వల్లించ నాదాత్మకముగా
మునుపు బ్రహ్మయు తాను మోదమునను
శివుడు తాండవమాడ శివగంగ పారాడ
నవరాగములజాడ నాట్యహేల
మంద్ర, మధ్యమ, తార మధురమున్ స్థాయిలన్
సామవేదమనగ స్వరములొప్పె

తే॥గీ॥ భవుని ఢమరుక ధ్వని నుండి ప్రభవమంది
కళలు వర్ధిల్లినవి చంద్ర కళలబోలి
అవియె అరువది నాలుగై అవని వెలసె
భవ్య సంగీత సాహిత్య పదము మెరిసె

సీ॥ ప్రారంభమునమంచి పద్యమున్ వినిపించి
సభకెల్ల మంచి సూచనలు చేసి
శ్రోతలన్ మరపించు గీతముల్ వినిపించి
దీవించి బాలలన్ దీక్షతోడ
స్వరరాగ మాలికల్ సమ్మతిగా గూర్చి
వాగ్దేవి కర్పించి వరుసగాను
ఆ తల్లి నర్చించి అందరి నలరించి
పాటల పల్లకిన్ పదిలముగను

✶

వాడిన మాట, విసిరిన రాయి తిరిగి రావు

# అమృత వాక్కులు

- వేదా చంద్రయ్య

1) అమూల్యమైన ఆత్మ జ్ఞానంతో పోలిస్తే సంపదలన్నీ చిన్నవే.
2) అంతా సుఖంగా శుభంగా ఉండాలని మన సనాతన ధర్మం చెబుతుంది. సానుకూల దృక్పథాన్ని అలవరచుకుంటే, మనసులో స్వార్థానికి ద్వేషానికి తావుండదు. మనకు అందివచ్చే అవకాశాల్ని ఉపయోగించుకోవాలే తప్ప, సాటి వారిని దోచుకోకూడదు.
3) పనికిరాని మాటల కన్నా మౌనమే మేలు.
4) గొంతు పెంచడం కాదు. మన మాట విలువ పెంచుకోవాలి. వాన చినుకులకే తప్ప ఉరుములకు పంటలు పండవు.
5) సహృదయులు మంచి స్వభావులు, రెండు వేరు వేరైనా, సహృదయులు మంచి సంబంధ బాంధవ్యాలను గెలుస్తారు. నిలుపకొంటారు. మంచి స్వభావము గలవారు ఆ మంచి హృదయాలను గెలుస్తారు.
6) ప్రతి మనిషిలోను మంచి చెడులు రెండు ఉంటాయి. మనలో మంచిని చూసిన వాళ్ళు ఆప్తులవుతారు, చెడును చూసిన వాళ్ళు శత్రువులవుతారు. రెంటిని సమానంగా చూసిన వాళ్ళు మనల్ని ప్రేమించేవారౌతారు.
7) ఎంత ధనం పోసినా ఆత్మానందాన్ని కొనలేము.
8) హక్కుల కంటె బాధ్యత గొప్పదని రామతత్త్వము, కష్టంలో కలిసి నడవాలన్నది సీత తత్త్వము, కుటుంబ బాధ్యతను పంచుకొమ్మంటుంది లక్ష్మణ తత్త్వము. నమ్మిన వారికోసం తెగించమంటుంది ఆంజనేయ తత్త్వము.
9) ఆత్మజ్ఞానం కోసమే శ్రీకృష్ణుడు సాందీప మహర్షి దగ్గరకు, శ్రీరాముల వారు వశిష్ఠముని దగ్గరకు వెళ్ళారు.
10) నిన్ను ఎవరైనా నిరాకరిస్తే సంతోషంగా అంగీకరించు, ఈ లోకంలో గొప్ప వ్యక్తులు... సాధకులు ఎందరో, ఎక్కడో ఎవరి చేతనో నిరాకరింపబడినవారే.

**పూలలోని సువాసన, మనిషిలోని యోగ్యత దాచితే దాగనివి**

# ఎంత మధురము రాజరాజేశ్వర

- శ్రీ కోడం మల్లయ్య

1) చ॥ ఎంత మధురము రాజరాజేశ్వర నీ భజన
ఎంత మధురము రాజరాజేశ్వర నీ స్మరణ ॥ ॥ఎంత॥

2) చ॥ తబల తాళాలుబట్టి కంజీర చేతబట్టి
భక్తితోడ నోరారా గానము చేస్తుంటే శివ ॥ ॥ఎంత॥

3) చ॥ వేములవాడలోన వెలసిన శ్రీరాజన్న
లింగరూపములో నీవు దర్శనంబులిస్తుంటే ॥ ॥ఎంత॥

4) చ॥ మూడు కన్నుల మూర్తివి మృత్యుంజయుడవు నీవు
ముక్తి ప్రసాదించుమని ముందుగ వేడుచుంటే ॥ ॥ఎంత॥

5) చ॥ మరువలేము మరువలేము ఏనాడు నీస్మరణ
విడువలేము విడువలేము ఏనాడు నీ చరణము ॥ ॥ఎంత॥

6) చ॥ పరిపరివిధముల నీదు ప్రార్థనలు చేస్తుంటే
పార్వతిపరమేశ్వరులుగా దీవెనలందిస్తుంటే ॥ ॥ఎంత॥

7) చ॥ కలియుగ దైవము నీవని కరములెత్తి మొక్కుచుంటే
భజనజేసె భక్తవరుల భవభయములు బాపుచుంటే ॥ ॥ఎంత॥

✶

**ఆత్మానందం పొందాలంటే - ఆచారంతో పాటు ఆచరణ కూడా చేయాలి**

**వ్యవస్థ మారాలంటే, ముందుగా మనం మారాలి**

# హనుమాన్ చాలీసా - 20

- అను, వ్యాఖ్య : ఆచార్య కసిరెడ్డి

**హిందీ :** దుర్గమ కాజ జగతకే జేతే ॥
సుగమ అనుగ్రహ తుమ్హరే తేతే ॥

**తెలుగు :** ఈ జగతిలో క్లిష్ట కార్యమ్ములన్నియును,
నీదు దయచే అన్ని సులభమ్ములవ్వను.

**భావం :** సువిశాలమైన ఈ ప్రపంచంలో అత్యంత క్లిష్టమైన కార్యాలు కూడా, నీ అనుగ్రహంవల్ల సులభతరమైపోతాయి.

**వ్యాఖ్య :** సృష్టి స్థితి లయకారులు త్రిమూర్తులు. సృష్టికర్త బ్రహ్మ, స్థితికారుడు విష్ణువు, లయకారుడు శివుడు. ఆ శివుడే ఆంజనేయస్వామిగా అవతరించి, శ్రీరామచంద్రునికి తోడుగా ఉండి, దాసోఽహమ్ కోసలేంద్రస్య అంటూ పరమ భక్తితో అనేక విజయాలను సాధించాడు. ఎవరికీ సాధించడానికి వీలులేని చాలా కష్టకార్యాల్లో విజయాన్ని పొందడం జరిగింది. ఇంద్రవజ్రాయుధాన్ని తట్టుకొని నిలబడడం, మైనాక, సురస, సింహిక, లంకిణి తదితరులతో వ్యవహరించిన తీరులో బలప్రదర్శనల ద్వారా యుక్తి ద్వారా విజయాలు సాధించడం ఎవరూ మరిచి పోలేనివి. అదేవిధంగా ఎందరో రాక్షసులను సంహరించి శ్రీరామచంద్రుని విజయానికి మూలకారకుడయ్యాడు.

శ్రీరామ సేతువు నిర్మాణంలోనూ ఆంజనేయునిదే అగ్రస్థానం. అందువల్ల అటువంటి హనుమంతుల వారిని స్మరించి మనం ఏ పనిచేసినా అందులో మనమూ విజయం సాధిస్తామనే ఈ సందేశాన్ని భక్తకవి తులసీదాసులవారు ఈ చాలీసా ద్వారా తెలియజేస్తున్నారు. ✶

**ఆచరణతో కూడిన జ్ఞాని జీవితం,**
**ఆనందమయం,**
**ఆదర్శనీయం ఆచరణ లేకుంటే అనర్థాలమయం.**

**నిద్రకు ఆలోచనకు పడదు ఒకటి ఉంటే మరొకటి రాదు**

# జీవుడా మేలుకో!

- బ్రహ్మలీన శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి

1) సాధనంబును చేయవలెనన్నా
అనుభూతియంతయు. సాధనంబుచె గట్టిపడునన్నా
నియమపూర్వక నిష్ఠచేతన
మురికినంతను తొలగద్రోచియు
నిర్మలంబగు మానసంబున
దేవదేవుని గాంచుచుండును
తత్త్వసారము తెలిసికోరన్నా
సద్గురుని చెంత, నిజము గనుగొని లాభమొందన్నా !

మానవుడు జన్మించినది మరల పుట్టకుండ చేసుకొనుటకే, జన్మ, మృత్యు, జర, వ్యాధి మున్నగు ఘోరదుఃఖముల నుండి, సంసారసాగరము నుండి తప్పించు కొనుటకే, అద్దానికొరకై సాధనము, శ్రవణమననాదులను, ధ్యానాదులను సలుపవలెను. ఆధ్యాత్మిక నియమములను సక్రమముగా ఆచరించవలెను. ప్రాతః కాలమున లేవగానే శుచిర్భూతుడై కొంచెము సమయమును దైవనామస్మరణ యందు, జపమందు వినియోగించవలెను. తదుపరి భగవద్గీతాది సద్గ్రంథములలో కొంతభాగమును పారాయణము గావించవలెను. గీతాదిబోధలను మనస్సునందు విచారణ సలుపవలెను.

పూజ, జపము, సంకీర్తనము, పారాయణము పూర్తికాగానే వీలయినంత సమయము, అరగంటగాని, ఒక గంటగాని భగవంతుని దివ్య విగ్రహమును లేక సద్గురుమూర్తినిగాని ధ్యానించవలెను. అనంతరము వ్యవహారమాచరించునపుడు నాటి దినమున ఆధ్యాత్మిక కార్య క్రమములన్నియు సక్రమముగా నెరవేరినవి లేనివి సింహావలోకనము గావించవలెను.

ఏదైన పొరపాటు ఉన్నచో మరునాటి నుండి అద్దానిని కలుగకుండ జాగ్రత్త వహించవలెను. తనకున్న ఆదాయములో కొంతభాగమును దానధర్మములు చేయుటయందు వినియోగించవలెను. శ్రద్ధాభక్తులతో, వినయవిధేయతలతో ఆత్మ విచారణతో కాలమును సదుపయోగము చేసుకొనవలెను. ఈ రీతిగ నియమనిష్ఠలతో సాధనగావించుచో మనస్సునందలి కామక్రోధాది, దంభ దర్పాది మురికియంతయు తొలగిపోవును. నిర్మలమగు చిత్తమందున

ఔదార్యం గల హృదయమే అమూల్యమైన హృదయం

దేవదేవుడు సాక్షాత్కారించును. ఆత్మానుభూతిచే నరునకు జన్మరాహిత్యము ఆనందప్రాప్తి సంభవించగలవు. ఓ జీవుడా ! అజ్ఞాననిద్ర నుండి లే! మేలుకో! సద్గురుని సాన్నిధ్యమున పారమార్థికసాధనా రహస్యములను గ్రహించు. ప్రతిదినము నియమపూర్వకముగ జపతపపూజ సంకీర్తనధ్యానాది సాధన చెయ్. చిత్తశుద్ధిని సంపాదించు. ఆత్మానుభవమొంది జన్మలక్ష్యమును సాధించు. తరించు.

**2) కాలమెంతో విలువ గలదన్నా**
**క్షణమైన దానిని ఖర్చుచేయకు భోగమందన్నా**
**గడచిపోయిన కాలమేమియు**
**సుంతయైనను తిరిగిరాదు**
**ఉన్నకాలము జాగరూకతో**
**గడిపివేయుమయ్య దైవచింతతో,**
**తత్త్వసారము తెలిసికోరన్నా**
**సద్గురుని చెంత, నిజము గనుగొని లాభమొందన్నా !**

ఎవరైన దూరదేశమునకు వెడలినప్పుడు, తమవద్దగల పైకము పూర్తిగ ఖర్చు కాకమునుపే, అచట పనులన్నిటిని పూర్తిచేసుకొని, క్షేమముగ స్వదేశమునకు తరిగి వచ్చెదరు. అట్లుగాక స్వకార్యములను నెరవేర్చుకొనకు అటగల వింతలను చూచుచు, భోగవిలాసములందే తన ధనమును, కాలమును దుర్వినియోగ పరచినచో కడకు ధనలేమిచే కష్టములపాలు కావలసినవచ్చును. అదేప్రకారముగ నరుడు తన ఆయువును, శక్తిని ప్రధానలక్ష్యమగు ఆత్మప్రాప్తి యందే వినియోగించి కృతకృత్యుడు కావలెను.

అలాగునకాక అమూల్యమగు నరజన్మను విషయభోగసంపాదనయందే ప్రాపంచిక వ్యర్థకార్యకలాపములందే ఉపయోగించినచో అంతమున అతడు దుఃఖములనే బడయవలసి వచ్చును. సంసార చక్రముననే తగుల్కొనిజనన మరణములను పొందుచు నానాబాధలు అనుభవించవలసివచ్చును. కావున జనులు తమ శక్తిని, కాలమును ఏ మాత్రము వ్యర్థపరుపక నిరంతరం దైవచింతనాతత్పరులై, యుక్తాహారవిహారులై మెలగుచు జీవితలక్ష్యమగు సచ్చిదానందాత్మను సాక్షాత్కారింపజేసుకొనవలెను.

ఓ జీవుడా ! అజ్ఞానప్రవర్తనను విడనాడు. మేలుకో. విలువైన కాలమున వృథా చేయకు. త్వరగ సద్గురుని పాదపద్మములను శరణుపొందు. అధ్యాత్మిక తత్త్వరహస్యములను తెలుసుకో. గడచిన కాలము తిరిగిరాదు. ఉన్న కాలమంతటిని జాగ్రత్తగ దైవ మార్గమున గడుపు. నీ శక్తిని, సామర్థ్యమును స్వస్వరూపసాక్షాత్కారమును పొందుట యందే వినియోగించు. వ్యవహారమాచరించునప్పుడు దైవస్మరణ. పరోపకారబుద్ధి కలిగియుండు. సాధనాతిశయముచే భగవత్కృతపకు పాత్రుడవై స్థితప్రజ్ఞుడవై తేజరిల్లు. ✶

**విజయంలో కన్నా విపత్తులోనే మనిషి గొప్పతనం తెలుస్తుంది**

# నీవు నా తల్లివి

కూర్పు : మర్పల్లి రాంరెడ్డి

ఛత్రసాలుడు ప్రజలను తన పిల్లలవలె సంరక్షణ చేశాడు. ఆయన అప్పుడప్పుడూ తన రాజ్యంలో పర్యటిస్తూ జన సంపర్కం ద్వారా వారి కష్టాలను అడిగి తెలుసుకునేవాడు. ఒకసారి ఆయన అందమైన రూపాన్ని చూచి ఒక యువతి ఆయన వైపు ఆకర్షితురాలైంది. కామం ఉన్న వారికి భయం, సిగ్గు ఉంటుంది ? ఆ యువతి మహారాజు వద్దకు వచ్చి సమయం చూచుకొని ఇలా అన్నది. "హే రాజా ! మీ వంటి దయాళువైన రాజు రాజ్యంలో కూడా నేను దుఃఖపడుతున్నాను''. రాజు చాలా దుఃఖపడ్డాడు. నేను నిరంతర ప్రయత్నశీలుడైనప్పటికి రాజ్యంలో స్త్రీ-పురుషులు బాధల ననుభవిస్తున్నారా ? అంటూ ఆలోచించ సాగాడు. అయితే రాజ్య పరిపాలన ద్వారా ఏమి లాభం ? ఆయన ఇలా అన్నాడు. "దేవీ ! మీకు ఏమి కష్టముందో తెలపండి. నేను దానిని దూరం చేయడానికి నా శక్తి కొలది ప్రయత్నిస్తాను.

యువతి ఇలా అన్నది ? "హే రాజా ! ఇలాంటి తియ్యతియ్యని ఓదార్పు మాటలు మాట్లాడుతారు. తర్వాత వాటిని అమలు పరచరు ; మీరు ముందు నాకు వాగ్దానం చేయండి. అప్పుడు నేను మీకు నా కష్టం గురించి తెలపడం సార్థకం అవుతుంది'' అంటూ ఆమె తన పాచిక విసిరింది.

మహారాజు సహృదయం గలవాడు. ప్రజలపై ప్రేమగలవాడు. ఆయన ఇలా అన్నాడు "దేవీ ! నీ దుఃఖం దూరం చేయడానికి నేను నా యథాశక్తి ప్రయత్నం చేస్తాను. యువతి ఇలా చెప్పింది. విషయం చిన్నది. నీ వలన నాకు నీలాంటి కుమారుడు కావాలి అని కోరుతున్నాను. ఆమె మాట వింటూనే మహారాజు కొన్ని క్షణాలవరకు కదలకుండ ఉండిపోయాడు. ఆయన గొప్ప వివేకంతో, సంయమనంతో ప్రవర్తించాడు. ఛత్రపాలుడు ఆ కామ పూరిత స్త్రీ చరణాలలో తలవంచి ఇలా అన్నాడు. "తల్లీ ! నీవు ఏ కుమారునికి జన్మనిస్తావో అతడు నావలె ఉండకపోవచ్చు. అందువలన ఈ నాటి నుండి నీవు నన్నే నీ పుత్రునిగా స్వీకరించు".

రాజు యొక్క ఆ మాట వింటూనే ఆ మహిళ యొక్క స్వప్నం చెల్లాచెదరైపోయింది. ఆమెకు తను చేసిన పొరపాటు తెలిసింది. జ్ఞానోదయమైంది. అయితే ఛత్రసాల మహారాజు తన జీవితాంతం ఆమె పట్ల శ్రద్ధ వహిస్తూ, రాజమాతవలె గౌరవించాడు. "పరస్త్రీని తల్లివలె, పరద్రవ్యాన్ని మంటిపెళ్లవలె, ఇతర ప్రాణులను తనవలె భావించేవాడు పండితుడు" అని ధర్మశాస్త్రం బోధిస్తున్నది. ✶

**నీ విజయాన్ని ఆశించినట్లు ఇతరుల విజయాన్ని ఆకాంక్షించు**

# నారాయణీయ సంక్షిప్త వివరణము

*(గత సంచిక తరువాయి)* **- శ్రీమతి హేమలతా బాలసుబ్రహ్మణ్యం**

**58) ఋతుకాలవర్ణనము -** బృందావనములోని భాండీరక వృక్షములే భగవంతుని యొక్క కోట ద్వారముగా నుండెను. ఆ వనమునందు సోదర గోపాలురసహితుడై శ్రీకృష్ణరూపధారియూన భగవంతుడు ఆ కోటలో, ఆ ఋతుకాలములో ఆనందముతో విహరించచుండగా అకస్మాత్తుగా ఆ కోట చుట్టూ దావాగ్ని విజృంభించగా అప్పుడు గోపాలురును గోవులను రక్షించుటకు పూనుకొనిన కృష్ణుడు వారిని కార్చిచ్చు నుండి తప్పించి నెమళ్ళ క్రీంకారములతోను ఆ కాలములో వికసించే చక్కని పుష్పములతో నిండిన గోవర్ధనగిరికి చేర్చెను. ఆ పర్వత గుహలందు, వారితో సహ ఆడిపాడి సంతోషముతో గడిపెను.

**59) వేణుగానము -** ఒకనాడు ఒక వెన్నెల రాత్రి లీలామానుష విగ్రహుడైన శ్రీకృష్ణుడు తన వేణుగానమును సారించెను. ఆ వేణుగానమును చేయుచున్న భగవంతుని రూపలావణ్యమును గాంచుటకు గోపికల హృదయము తహతహలాడుచండుగా అగ్ని సంపర్కముతో ఘృతమెలాకరుగునో అలా కరిగి బాధపడుచుండగా ఆ గానమున విని పశు పక్ష్యాదులు దేవాంగనలు ఆనందపారవశ్యులు కాగా నేత్రగోచరమైన భగవంతుని మోహన బింబము ఆ వేణువును మ్రోగించునప్పుడు ఆ చేతివ్రేళ్ళ కదలికలు తాళమునకు కట్టుబడిన ఆ పాదపల్లవములు వజ్రములాగ మెరిసే ఆ శరీరలావణ్యము అమృతతుల్యములైన ఆ అధరపల్లవములు మన్మథ బాణములకువశులై విరహతాపములో మునిగిన గోపికల మోహము, ఆ విరహోత్కంఠితులు భగవంతుని అధరములను పానము చేయవలెననే పరిస్థితికి గురియైరి.

**60) గోపికావస్త్రాపహరణము -** ప్రేమార్ద్ర హృదయముతో తడిసిన కన్నులతో గోపాంగనలు భగవంతునినే భర్తగా పొందవలెనని కోరికతో కాత్యాయనీ వ్రతమును చేయబూని ప్రాతఃకాలములో యమునా నదిలో స్నానమాచరించవలెనని తలంచి, తీరములో తమ తమ వస్త్రములనుంచి స్నానమాచరించుచుండగా అప్పుడు లీలామానుష విగ్రహుడైన శ్రీకృష్ణుడు వారందరి వస్త్రములను అపహరించగా వారందరు వారి వస్త్రములను తిరిగి ఇమ్మని

ఈ రోజుటి మంచిపని, రేపటికి శ్రీరామరక్ష

ప్రార్థించగా "మీరడిగినది మీకు లభించును గట్టు మీదికి వచ్చి స్వీకరింపుడు" అని అనగా వారందరు తీరమునకు వచ్చి తమ వస్త్రములను స్వీకరించగా భగవానుడు వారి కోరికకలు రాబోయే పౌర్ణమి రాత్రి తీరునని అనుగ్రహించెను.

**61) యజ్ఞపత్నులను అనుగ్రహించుట –** ఒకనాడు శ్రీకృష్ణవేషధారియైన భగవంతుడు గోపాలకులతో బృందావనమునకు అతిదూరముగా అడవికి వెళ్ళి తన పరమభక్తురాంద్రులైన ద్విజస్త్రీలను అనుగ్రహింపదలచి అచ్చటికి రాగా అప్పుడాగోప బాలకులు ఆకలి దాహములకు లోనుకాగా శ్రీకృష్ణుడు వారితో "సమీపములోనే విప్రులు యజ్ఞము చేయుచున్నారు. మీరచ్చటికి వెళ్ళి ఆహారమునకై వారిని ప్రార్థింపుడు అని చెప్పగా వారలాగే వెళ్ళి ప్రార్థించగా ఆ విప్రులు వారి మాటలను వినియు విననట్లుండగా అప్పుడు వారి పత్నులు వారి మాటలను విని శ్రీకృష్ణుని చూడవచ్చుననే ఆశతో, భక్ష్య–భోజ్య–చోష్య–లేహ్యములనే చతుర్విధములైన ఆహారములను తీసుకొని శ్రీకృష్ణుని దర్శించి ఆ ఆహారములను శ్రీకృష్ణునితో సహ అందరికి ఇచ్చి భగవంతుడు భుజించే అందమును చూచి పరమవశులైరి.

**62) ఇంద్ర యాగ నివారణము –** వర్షాధిపతియైన దేవేంద్రుని కొఱకు యాగముచేయదలచిన నందుని గోవర్ధనగిరియే అన్ని విషయములందును శ్రేష్ఠమైనదనియు దానికే పూజాదులు చేయవలెనని భగవద్రూపుడైన శ్రీకృష్ణుడు ఇంద్రయాగమును నివారించి గోవర్ధనగిరిని ప్రదక్షిణాది సమస్తోపచారములతో పూజించగా దేంద్రుడు అధిక కృద్ధుడాయెను.

**63) గోవర్ధనోద్ధరణము లేక గిరిధారి –** తనకు పూజలాచరించక గోవర్ధనగిరిక పూజలాచరించుటవలన కుపితుడైన దేవేంద్రుడు ప్రళయ మేఘములతో పెద్ద వడగండ్ల వానను కురపించగా బృందావనమంతయు మునిగిపోవుచుండగా, ఆ మేఘ గర్జనలకు దిక్కులన్నియు కంపించగా అప్పుడా యాదవులందరు శ్రీ కృష్ణస్వరూపుడైన భగవంతుని శరణువేడగా వారిని రక్షించుకొఱకు తన యొక్క చేతివ్రేళ్ళతో సమూలముగా గిరిని పెకలించి అదే చేతితో ఆ గిరిని ఛత్రమువలే పైకెత్తి అక్కడున్న వారందరిని రక్షించెను. ఈ దృశ్యమును చూచి భయపడిన ఇంద్రుడు భగవంతుని శరణుజొచ్చెను. పూర్వము వరాహ అవతారకాలమున బంతిలాగనున్న భూమిని అవలీలగా తనకోరల అగ్రభాగములో మోసిన భగవంతునికి ఈ గోవర్ధన గిరిని మోయుట ఎంతమాత్రము ?

**64) గోవిందపట్టాభిషేకము–గోపాలకుల పరమపద దర్శనము –** గోవర్ధనోద్ధారణమును చేసిన నిన్ను గాంచిన యాదవులు, నిన్ను, జగన్నాథుడైన నారాయణునిగా భావించిరి.

సద్గుణాలు విలువైన ఆభరణాలు

దేవేంద్రుడు కూడ. భగవద్రూపుడైన నీ శక్తి ప్రభావములను తెలుసుకొని ఐరావతము ద్వారా ఆకాశగరిగను తెప్పించి అభిషిక్తుని గావించెను. అదేవిధముగా దివ్యమైన కామధేనువు యొక్క క్షీరముతో అభిషేకించెను. అనగా దోషరహితమైన గంగాజలము, కామధేనువు క్షీరముతో అభిషేకించి ఆ గోవిందుని గోకులాధిపతిగా పట్టాభిషిక్తుని గావించెను. అదే సమయంలో యమునా నదిలో పడి మునిగిపోయిన నందగోవుని వరుణ లోకమునకు వెళ్ళి విడిపించెను. యముని కూడ జయించి, ఆ యాదవులకు తన విశ్వరూప సందర్శనముగావించెను. ఈ విధముగా కోరిన వరములను ప్రసాదించేటటువంటియు ఆ పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీకృష్ణుడు జీవితాంతమువరకు మనలందరిని రక్షించునది ఆ గోవిందనామ సంకీర్తనమే.

**65) రాసక్రీడ (ప్రథమ భాగము) –** శృంగార రసముతో కూడిన గోపికలతో భగవంతుడు జరిపినదే ఈ రాసక్రీడ. ఆ రాసక్రీడ బృందావన వాసులు చేసిన మహాపుణ్యమే అగును. ఇది ఎవరికి ప్రాప్తించును? పూర్ణచంద్రుని చంద్రికలో యమునా తీరపు లీనములో మన్మథోత్సవమునకు ఆహ్వానమణివలే ఆ భగవంతుడు వేణుగానమును చేయగా విరహతాపము చేత, తపించిన గోపికలు తల్లడిల్లగా ఆ తాపము నుండి భక్తిరసముత్పత్తి కాగా ఆ పరమాత్మను ఈ జీవాత్మలు కలియుటయే ముక్తికన్న ఉత్కృష్టమైన ఈ భక్తియే కారణమగుచున్నది.

**66) రాసక్రీడ (ద్వితీయ భాగము) –** ఈ విధముగా మన్మథశరములకు గురియైన గోపికలు భగవంతుని తనివితీర ఆలింగమనము చేసుకొనగా ఆ గోపికలను ఆటపాట క్రీడలతో మురిపించెను. అప్పుడు గోపికలు యమునా నది ఇసుక తిన్నెలపై తమ తమ ఉత్తరరీయములతో చక్కని ఆసనముల నేర్పరచిరి. ఆ సమయములోనే తన అత్యున్నత అమృతములాంటి స్తనద్వయముతో అచ్చటికి వచ్చిన రాధను కూడ రమింపచేసి మిగిలిన గోపికలనందరిని ప్రేమామృతములో ముంచిన భగవంతుడు కుందపుష్పమువలే నున్న శ్వేతహారమును కంఠములో ధరించి శోభించెను.

**67) రాసక్రీడ – తృతీయ భాగము –** ఈ విధముగా భగవంతుని శోభనక్రీడలచేత గోపికలు అతిసుఖముగాను పొంది ఆ సుఖము వలన గర్వితులై యుండగా అనగా జగదేక సుందరుడైన శ్రీకృష్ణరూపధారియుయైన (భగవంతుడు) తమ ప్రేమ పాశములో చిక్కుకున్నాడని గర్వించగా వారి గర్వమును పోగొట్టుటకై భగవంతుడు కొంచెముసేపు అంతర్హితుడై వారిని ఏడ్పించి తరువాత వారికి ప్రత్యక్షమై రాసలీలలను చేసెను. అనగా భగవంతుడు అంతర్హితుడైనచో దుఃఖమును కనపడినచో అతనియందే లయమైనంత సుఖమును పొందిరి.

**నీ ప్రతిభ, నైపుణ్యం చెడుకు ఉపయోగిస్తే నష్టపోయేది నీవే**

**68) రాసక్రీడ – చతుర్థ భాగము –** ఈ విధముగా గోపికలు భగవంతునినే ధ్యానించుతూ తమ భావనా బలముచేత భగవంతుని యందే తాదాత్మ్యమును పొంది ఆనంద వారిధియందు తేలుతూ త్రివిక్రముడై ఆకాశమునావరించిన ఆ పాదమును తడిమి నిమురుతూ పులకాంకితులై సీమారహితమైన తమ ప్రేమతో సరసలీలలలో మునిగి తమను తామే మరచి రాసక్రీడలో పాల్గొనిరి.

**69) రాసక్రీడ – పంచమ భాగము –** ఆ రజత రజనీ చంద్రికలో భగవంతుని రాసకేళీ ప్రారంభమాయెను. భగవంతుని వక్షస్థలమందు చందన గంధముతో కూడిన మాల కటి ప్రదేశమందు "ధగాధగా" మెరిసే పట్టు పీతాంబరము చేతియందు వేణువు దాని నుండి వెలువడిన వేణుగానము మురిసే మువ్వలతో కూడిన అతినళినమైన నాట్యము ఆనంద పారవశ్యముచేతను సుఖపారవశ్యముచేతను మధమత్తులై ఆ మన్మథోత్సవములో జలక్రీడలు చేయుచు భగవంతునితో సంగమించినట్లు భావించి ఆ అమరుఖమును ఆ యమునా పులినములలో పొందిరి. ఆ అమాయకులు పొందిన అమర సుఖము ఒక నూతనమైన భక్తితో కూడిన అమరప్రేమకావ్యము.

*(సశేషం)*

## తెలుఁగు బిడ్డ

శ్రీలు పొంగునట్టి – పాలకడలి బిడ్డ
తెలుఁగు గడ్డ మనకు – వెలుఁగు గడ్డ
అఖిల భారతాంబ – కందాల వీణరా
తెలివి కలిగి మెలఁగు – తెలుఁగు బిడ్డ

తెలుఁగు భాషనాది – తెలుఁగు వాడను నేను
తెలుఁగు బిడ్డ – నాకు కనుల వెలుఁగు ।
తేనె కలిపి కథలు – తెలియ జెప్పుచునుండు
తెలివి కలిగి మెలఁగు – తెలుఁగు బిడ్డ ।

– శ్రీ ముళ్ళపూడి సచ్చిదానందమూర్తి

గొప్పతనం ఎప్పుడూ నిరాడంబరంగానే ఉంటుంది

# గురు పూర్ణిమ

**కూర్పు : ఆకుల రామయ్య**

పూర్ణము శూన్యము నెరుగదు. శూన్యానికి పూర్ణము తెలియదు. పూర్ణం కావాలని అందరికీ ఆశ. పరిపూర్ణం కావాలని ఒకటే ఆశ. పూర్ణం కావాలా ! పూర్ణమై శోభించాలా !

అయితే గురువును చేరు. మారుతుంది బ్రతుకుతీరు. క్షీరము నిచ్చేది ధేనువు. జ్ఞానమునిచ్చేది గురువు. తల్లిని మరిపిస్తుంది ధేనువు. తల్లిదండ్రులను మరిపిస్తాడు గురువు. గడ్డి తిని పాలిచ్చేది ధేనువు. కన్నీరు మ్రింగి పన్నీరు చల్లేవాడు గురువు. అలాగని, గురువులు ఆవులు కారు ; కవులు, క్రాంత దర్శులు.

గాలినిచ్చేది తరువు, జాలి చూపేది గురువు.

ఆశించదు దేనినీ తరువు. ఆశలెరుగనివాడు గురువు. ఎండుతూ నీడనిస్తుంది తరువు శ్రమిస్తూ సుఖాన్ని పంచేవాడు గురువు. కొట్టినా ఫలానిస్తుంది తరువు. చీదరించుకున్నా చేరదీస్తాడు గురువు.

ఫలాల పంపకం తరువుది. మోక్షఫలాల సంతర్పణం గురువుది.

జల పూర్ణము చెరువు. ప్రేమ పూర్ణుడు గురువు.

దాటిపోదు జలము చెరువును వదలిపోరు శిష్యులు గురువును, మేను చల్లబడుతుంది దిగితే చెరువులో మనసు శాంతిస్తుంది రమిస్తే గురుబోధలో.

చెట్లని పెంచేది ఎరువు. శిష్యుల్ని పెంచేది గురువు.

అవనిలోపలే ఎరువు. అవలోకిస్తేనే గురువు.
దేవ గురుడు బృహస్పతి గురుదేవుడెప్పుడూ సరస్వతే.

## గురుసన్నిధిలో -

ఉన్నవాళ్లూ అనుభవిస్తారు, లేనివాళ్ళూ అనుభవిస్తారు. గురువు ఉన్నవాళ్ళు అనుభవించేది ఆనందం. గురువులేని వాళ్లు అనుభవించేది దుఃఖం.

**పట్టుదల వుంటే పడినా తిరిగిలేచి ముందుకు సాగవచ్చు**

**గురువైభవం -**

రవిరాజు చూపలేనిది, సురరాజు చూడలేనిది,
గురురాజు నిలయం నటరాజు ఆలయం
మాటలు పోలవు గురు మహిమను పలుకుటకు
కన్నులు చాలవు గురు మహిమను చూచుటకు

**గురుకృపతో -**

గుండెల్లో తాపాలు తొలుగుతాయి. గుడిసెల్లో దీపాలు వెలుగుతాయి.

**గురుసేవలో -**

పరువు పోదు. కరువు రాదు.

**కనుకనే,**

అందరికీ పండుగలెన్నో అయితే,
గురు బిడ్డలందరికీ ఒకే పండుగ
అదే గురు పండుగ, శిష్యులు హృదయాల నిండుగ.

**లోకాః సమస్తా స్సుఖినోభవంతు** ✶

**అభివృద్ధి పథంలో పయనిస్తున్నానని
అంచెలంచెలుగా విజయ పథంలో సాగుతున్నానని
మిడిసిపడక, వృద్ధ తల్లిదండ్రులకు కూడా కొంత
సమయం కేటాయించి సేవలందించు - నీ
ఎదుగుదల వారి ఆశీర్వాదమే అని గ్రహించు**

అధికార దుర్వినియోగం పెద్ద ప్రమాదాలను తెచ్చి పెడుతుంది

# సంక్రాంతి చైతన్య క్రాంతి

**- ఆచార్య కసిరెడ్డి**

సూర్యుడు ప్రతిమాసం ఒక రాశిలో ప్రవేశిస్తాడు. 1) మేష 2) వృషభ 3) మిథున 4) కటక 5) సింహ 6) కన్య 7) తుల 8) వృశ్చిక 9) ధనుః 10) మకర 11) కుంభ 12) మీన – ఇవే ద్వాదశరాసులు. ధనుస్సులో ప్రవేశించిన సూర్యుని ప్రస్థానం గమ్యం చేరి మకరంలో ప్రవేశిస్తుంది. మకరంలో ప్రవేశించడమే మకర సంక్రాంతి. మేషంలో చేరితే మేష సంక్రాంతి, మీనంలో చేరితే మీన సంక్రాంతి. ఇలా సంవత్సరంలో పండ్రెండు సంక్రాంతులుంటాయి.

ధనుర్మాసానికి ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యముంది. జీవాత్మయైన గోదాదేవి. విశ్వాత్మయైన రంగనాయకునిలో ఈ మకర సంక్రాంతి నాడే కలిసిపోయింది. అండాళ్ రంగనాయకుల కల్యాణం జరిగింది రోజే.

సూర్యుని తీక్షణ కాంతి ఈ రోజు నుండే సర్వజీవ కోటికి అనుభవంలోకి వస్తుంది. ముడుచుకుపోయిన సృష్టి వికాసం మహా వేగంగా జరుగుతుంది.

ఈ రోజే యమాలయం కవాటం మూయబడింది ; సురాలయం తలుపు తీయబడింది. దక్షిణాయనాధ్యాయం సమాప్తమయింది. సూర్యనారాయణుడుత్తరాయణ పరాయణుడైన శుభ సందర్భంలో ఇవన్నీ జరిగినై. ఉత్తరాయణంలో వైకుంఠ ద్వారాన్ని తెరిచి ఉంచవలసిందని బలి విష్ణువును కోరినట్టు పౌరాణికులంటున్నారు.

సంక్రాంతి సందర్భంగా మూడు రోజులు భోగి, సంక్రాంతి, కనుము పేర పండుగ జరుపుతారు. ఈ మూడూ మనుష్య దేవ పశుపక్ష్యాదుల తృప్తి నిమిత్తం నిర్వహించేవిగా అర్థాలు చెబుతారు.

సంక్రాంతి పొలాల పండుగగా ప్రచారంలో ఉంది. వర్షాకాలం పంటలన్నీ ఇంటికి వస్తాయి. ఆకారణంగా ఇల్లంతా సందడిగా ఉంటుంది. అల్లుండ్రూ కూతుళ్లతో కుటుంబం

**ఆందోళన అనారోగ్యాన్ని పెంచుతుంది**

పరమానందంతో వ్యవహరిస్తుంది. సంక్రాంతి లక్ష్మి హేమంత వీధిని ఇలా వస్తుందని మహాకవి తుమ్మల అంటాడు.

**కొసరి నూరిన పసపు పచ్చిపూత మొగాన**
**గుమ్మడి పూదుమారమ్మునద్ది**
**కంద రేగడనారబండి కన్పండువై**
**పొలుచు మిర్యపు పండు బొట్టు వెట్టి**
**వలిపెమ్మునకు నొక్కవాసి హెచ్చయినట్టి**
**నునుమంచు తెరచీర నూలుకొల్పి**
**బంతి పూవులను చేమంతి నెయ్యము గూర్చి**
**కబరీభరమ్ము చక్కనగుదిర్చి**
**పంట కళ్లాలు మును బరాబరులు సేయ**
**గూడు గట్టిన తెలిమబ్బు గొడుగునీడ**
**కదలి వచ్చెను భాగ్యాల కదలివోలె**
**మకర సంక్రాంతి లక్ష్మి హేమంతవీథి** **(పరిగి పంట)**

మకర సంక్రాంతి లక్ష్మి గుమ్మడి పూల పుప్పొడిని పసపు పచ్చిపూతలాగా ముఖానికి పూనుకొన్నది. కందరేగడలో ఆరపండిన మిర్యపుపండు బొట్టును పెట్టుకొన్నది. నునుమంచు తెరనే చీరగా ధరించింది. కేశపాశంలో బంతులనూ చేమంతులను తురుముకొన్నది. పంటకళ్లాలు స్వాగతం పలుకుతుండగా, తెల్లటిమబ్బునే గొడుగుగా ధరించి, భాగ్యాల సముద్రంలాగా మకర సంక్రాంతి లక్ష్మీ వచ్చింది.

పండుగ మనకళ్లముందు ఓ భావచిత్రంలా నిలిచినట్లుంది. ఇలాంటి భావచిత్రాలే ఉత్సాహాన్నిచ్చి, జీవితాన్ని చైతన్యవంతం చేస్తాయి. అందుకే సంక్రాంతే ఒక చైతన్యక్రాంతి.

**సంక్రమించిన ధనంతో సంతోషాన్ని పొందగలం, స్వయం కృషితో సంపాదించిన ధనంతో ఆత్మ సంతృప్తి పొందగలం.**

**మంచి పని ప్రతిదీ మొదట కష్టమనిపిస్తుంది**

# చిదానంద అష్టోత్తర శతనామావళిః

1. ఓం శ్రీ అనంతగుణవిభూషితాయనమః
2. ఓం శ్రీ అజ్ఞానహరణాయ నమః
3. ఓం శ్రీ అవర్ణ్యగుణోజ్వలాయ నమః
4. ఓం శ్రీ అతీంద్రియాయ నమః
5. ఓం శ్రీ అక్షయ ప్రతిభాయ నమః
6. ఓం శ్రీ ఆత్మానందాయ నమః
7. ఓం శ్రీ ఆశ్రితవత్సలాయ నమః
8. ఓం శ్రీ ఆనందనిమగ్న చిత్తాయ నమః
9. ఓం శ్రీ ఉదారకీర్తయే నమః
10. ఓం శ్రీ కరుణావాసాయ నమః
11. ఓం శ్రీ కరుణాసాగరాయ నమః
12. ఓం శ్రీ కళ్యాణ ప్రకృతాయ నమః
13. ఓం శ్రీ కుష్ఠురోగితాపవినాశనాయన నమః
14. ఓం శ్రీ కృపాపీయూషజలాయ నమః
15. ఓం శ్రీ గురుపాదాబ్జవిహారిణే నమః
16. ఓం శ్రీ గుణాకారాయ నమః
17. ఓం శ్రీ జితక్రోధాయ నమః
18. ఓం శ్రీ తత్త్వస్వరూపాయ నమః
19. ఓం శ్రీ దీనత్రాణతత్పరాయ నమః
20. ఓం శ్రీ దివ్యమూర్తయే నమః
21. ఓం శ్రీ దయావారధయే నమః
22. ఓం శ్రీ ధీరోదాత్తాయ నమః
23. ఓం శ్రీ నిర్లేపాయ నమః
24. ఓం శ్రీ నిత్యనిర్మలాయ నమః
25. ఓం శ్రీ నిరంజనాయ నమః
26. ఓం శ్రీ నీతిమతే నమః
27. ఓం శ్రీ నియతకళ్యానాయ నమః
28. ఓం శ్రీ నిర్వికారాయ నమః
29. ఓం శ్రీ ప్రణవస్వరూపాయ నమః
30. ఓం శ్రీ పరమసాత్త్వికాయ నమః
31. ఓం శ్రీ పరత్పారాయ నమః
32. ఓం శ్రీ పుణ్యవర్ధనాయ నమః
33. ఓం శ్రీ పుణ్యపురుషాయ నమః
34. ఓం శ్రీ పావనస్వరూపాయ నమః
35. ఓం శ్రీ పురుషోత్తమాయ నమః
36. ఓం శ్రీ పరమజ్యోతిషే నమః
37. ఓం శ్రీ ప్రియంవదాయ నమః
38. ఓం శ్రీ ప్రీతివర్ధనాయ నమః
39. ఓం శ్రీ పరమపూజ్యాయ నమః
40. ఓం శ్రీ బ్రహ్మణ్యాయ నమః
41. ఓం శ్రీ భవ్యాయ నమః
42. ఓం శ్రీ భవబంధవిమోచనాయ నమః
43. ఓం శ్రీ భయాపహాయ నమః
44. ఓం శ్రీ భక్తశోకవినాశకాయ నమః
45. ఓం శ్రీ భవతారణకారణాయ నమః
46. ఓం శ్రీ మోక్షదాయ నమః
47. ఓం శ్రీ మృదుభాషణాయ నమః
48. ఓం శ్రీ మహానిధయే నమః
49. ఓం శ్రీ మిహిరాధిక కాంతిమతే నమః
50. ఓం శ్రీ మహాయోగినే నమః
51. ఓం శ్రీ మహాద్యుతయే నమః
52. ఓం శ్రీ మాన్యాయ నమః
53. ఓం శ్రీ మహామతయే నమః
54. ఓం శ్రీ యతీంద్రాయ నమః

**కష్టమేమిటో తెలిసిన వారికి సుఖం విలువ తెలుస్తుంది**

55. ఓం శ్రీ యజ్ఞస్వరూపిణే నమః
56. ఓం శ్రీ యోగీశ్వరాయ నమః
57. ఓం శ్రీ వాగ్మినేయ నమః
58. ఓం శ్రీ వైద్యవరిష్ఠాయ నమః
59. ఓం శ్రీ వీతరాగాయ నమః
60. ఓం శ్రీ వినయాత్మనే నమః
61. ఓం శ్రీ వాచస్పతయే నమః
62. ఓం శ్రీ వరప్రదాయ నమః
63. ఓం శ్రీ వశీకృతాఖిలజగతే నమః
64. ఓం శ్రీ విద్యారాశయే నమః
65. ఓం శ్రీ వైరాగ్య విశుద్ధచిత్తాయ నమః
66. ఓం శ్రీ శాంతస్వరూపిణే నమః
67. ఓం శ్రీ శివానంద వాత్సల్యభజనాయ నమః
68. ఓం శ్రీ శివానంద స్వరూపిణే నమః
69. ఓం శ్రీ శిష్టపూజితాయ నమః
70. ఓం శ్రీ శివాకారాయ నమః
71. ఓం శ్రీ శరణాగతవత్సలాయ నమః
72. ఓం శ్రీ సర్వగుణోపేతాయ నమః
73. ఓం శ్రీ సర్వమంగళకర్త్రేయ నమః
74. ఓం శ్రీ సర్వకామదాయ నమః
75. ఓం శ్రీ సర్వదుఃఖశమనాయ నమః
76. ఓం శ్రీ స్మిత భూషిణే నమః
77. ఓం శ్రీ నియతకళ్యానాయ నమః
78. ఓం శ్రీ సుమనసే నమః
79. ఓం శ్రీ సుశీలాయ నమః
80. ఓం శ్రీ సర్వదేహిశరణ్యాయ నమః
81. ఓం శ్రీ సర్వాత్మనే నమః
82. ఓం శ్రీ సౌమ్యాయ నమః
83. ఓం శ్రీ సర్వప్రాణిసుహృదే నమః
84. ఓం శ్రీ సర్వభూతానుకంపినే నమః
85. ఓం శ్రీ సంశ్రుతాభీష్టదాయ నమః
86. ఓం శ్రీ సనాతనాయ నమః
87. ఓం శ్రీ సత్సస్వరూపాయ నమః
88. ఓం శ్రీ సర్వజితే నమః
89. ఓం శ్రీ సర్వోత్తమాయ నమః
90. ఓం శ్రీ సమస్తజనపూజితాయ నమః
91. ఓం శ్రీ సద్గురు చరణరతయే నమః
92. ఓం శ్రీ సత్యకీర్తయే నమః
93. ఓం శ్రీ సన్న్యాసివర్యాయ నమః
94. ఓం శ్రీ స్వయంతేజసే నమః
95. ఓం శ్రీ సుదీప్తిమతే నమః
96. ఓం శ్రీ సర్వోపాధివినిర్ముక్తాయ నమః
97. ఓం శ్రీ సచ్చిదానంద విగ్రహాయ నమః
98. ఓం శ్రీ సంసారరోగభిషజే నమః
99. ఓం శ్రీ సత్యవ్రతాయ నమః
100. ఓం శ్రీ సుకీర్తయే నమః
101. ఓం శ్రీ సర్వవేదవిదే నమః
102. ఓం శ్రీ సదాచారశీలాయ నమః
103. ఓం శ్రీ సర్వజ్ఞాయ నమః
104. ఓం శ్రీ హంసాయ నమః
105. ఓం శ్రీ అభివంద్యాయ నమః
106. ఓం శ్రీ పరమేష్ఠినే నమః
107. ఓం శ్రీ శివానంద హృదయకలభృంగాయ నమః
108. ఓం శ్రీ సద్గురు చిదానందస్వామినే నమః

✶

**(పరమపూజ్యశ్రీ చిదానంద స్వాములవారి అష్టమ పుణ్యతిథి ఆరాధన తేదీని బట్టి 28-8-2016 తేదీన మరియు తిథినిబట్టి 30-8-2016 తేదీన జరుగును.)**

**దుర్బుద్ధి తాను నింపిన విషపాత్రను తానే త్రాగుతుంది**

# THE MAHAMANTRA SANKIRTANA YOGA

**- Swami Chidananda**

I deem it my sacred duty to most humbly offer both on my own behalf as well as on behalf of you all, our crores of prostrations to the Almighty for having given us this rare and precious good fortune of taking part in this holy celebration to talk about this great Mantra, to hear about the Divine Name and to sing this Mahamantra. On the 3rd of December, 1943, the chant was commenced at about 9.45 a.m. and Gurudev was the first to initiate this Maha-yajna of the Divine Name and it has been going on these past sixty years. When the 'Vishwanath Mandir' was ready, Sri Gurudev wanted to perform the installation of the Murtis on the 31st of December, 1943, as a great number of devotees were to attend the Christmas Sadhana Week conducted those days. He was not for - postponement of the installation ceremony, as he was a great votary of the philosophy of D.I.N. (DO IT NOW). But many Pandits (priests), especially, objected to this, with the plea that it was inauspicious to do the installation in the Dakshinayana (southern movement of the Sun). Sri Swamiji Maharaj however, silenced them by saying that to counteract any possible inauspiciousness, which he was sure could not befall in matters involving no selfish motive and meant for Vishvakalyana or peace and happiness in the world, he would commenc the Akhanda Mahamantra Kirtan immediately. And thus the Yajna started on the 3rd of December, 1943. Though it was originally meant to be conducted upto the 31st of December, 1943 only, to ward off evil effects, if any, Sri Swamiji wished that a good thing, once started, should not be stopped but continued perennially, for the solidarity of the world, especially in view of the critical situation then prevailing on account of World War II. (The Pratishtha Mahotsava in the Vishwanath Mandir was done on 31st December, 1943 at 11.30 a.m. and Sridhar Raoji—now, Swami Chidananda— was the first Pujari).

**Freedom starts in the mind, not by cutting ropes**

We have to offer with equal feelings of gratefulness and worship again and again our countless adorations at the divine feet of Gurudev for being instrumental, for being the visible external cause, for having placed us in the wonderful privileged position of living constantly within the orbit of the resounding chant of the Divine Name of taking part in it, being always placed in this divine aura which he has created by the Kirtan, specially by this Akhanda Mahamantra Kirtan Yajna that he has started for the benefit of all of us and the benefit of the whole world at large.

The Divine Name in the form of the Mahamantra has been specially selected by him for the reasons which you all know. The age in which we are living is Kali Yuga. Therefore, Gurudev has realised that we who have taken bodies in this Iron Age, suffer under the severe limitations which the average human body and mind are subject to.

What are those limitations? Upon the spiritual field, the main limitations are that the physical system of the average man cannot bear the strain of intense and acute Yoga practices which our forefathers were able to do successfully.

The wise and compassionate sages of yore, who were Trikala-Jnanis and had knowledge of the past, present and the future as well, perceived this state of things that was to prevail with the advent of the Iron Age. They were moved by compassion. One of the greatest among them approached directly the Divine Creator and pleaded on behalf of us all, dwellers of this present Age for an easy way and method by which we could be enabled to overcome the miseries of our time; and proceed victoriously towards the real Peace and Bliss, which is our birthright as human beings. In answer to this plea, this Divine boon of the sacred Mahamantra was bestowed to us. The unique importance and glory o this Mantra to us, dwellers in the modern age, lies in the fact that with merciful consideration for the state of mankind in this age, the practice

**To give happiness to others is a great act of charity**

of this Mantra has been totally freed from all rules, regulations, restrictions and such observances that are applicable to all the other Mantras or sacred chants. This Mahamantra or the great chant is a universal Mantra tha anyone can practise in any condition he may be and in any way he likes.

Ordinarily in the case of these sacred Mantras, the practice of their Japa should be done in a strictly disciplined manner. Time and place are laid down. Qualifications for the practitioner are also mentioned. The place should be clean. Japa is to be performed after bath and before taking food. These and similar restrictions and rules are laid down. But knowing that the present-day modern man is caught up in the complicated machines of economic struggle, who cannot govern time, who is himsel governed by time and that he has not the requisite leisure and freedom to faithfully follow scriptural injunctions and devote himself exclusively for a considerable period of time in the practice of systematic Japa etc., this Mantra was specially given for his welfare and happiness here and his salvation hereafter. If you realise what this means, then you will jubilantly rejoice, as a man would do at the discovery of an immense treasure. You would be filled with a wonderful hope, joy and a new courage. For, in the Mahamantra you have the promise and assurance of a new power and a new life. Where hope was lost, fresh hope will dawn again. Where there was despair, courage will now step in.

How very wonderfully suited it is for this age can be realised when we just for a moment think that these conditions, these facts about the Mahamantra were specially given by Brahma to Sri Narada when the latter put this very particular and pointed question. "O Lord! In the Kali Yuga, people are destitute of religious sense; they are destitute of capacity for Yoga, of all Adhikaritva, they are completely shorn of all good points; they are all full of evil qualities, they are not capable of following any system of Achara or ritual, in this condition when the whole of the

**A smile can make short work of any difficulty**

humanity is in such a fallen state, what is the way of attaining God-consciousness? What is the way of freeing the Jiva from the thraldom of birth and death? How to get out of this wheel of birth and death?" To this very pointed and pertinent question, the reply came from Lord Brahma, "This is the way. Chant the Mahamantra. Constantly be immersed in the chant of this great Mantra. No regulations are there and it may be chanted by all. It is a Mantra that will raise one to the highest state of God-consciousness or Samadhi which any other Yoga, Raja Yoga or Vedantic Nididhyasana will enable man to attain." This is the unique feature about Kirtan, especially of Mahamantra Kirtan.

Sankirtan Yoga has this unique speciality that it forms a complete integral system. By calling it a complete integral system, we mean that this Sadhana does not have any separate preliminaries which the aspirant has to practise and finish before he becomes qualified or before he is made an Adhikari to take up this Sadhana. There are other systems which first of all require that a distinct set of preliminary Sadhanas be gone through before the aspirant takes up the main Sadhana. Whereas, this integral Sadhana contains all that in itself—it is itself the foundation, it is itself the preliminary, it is itself the main Sadhana, and what is more, a true devotee considers it as the consummation and the realisation. To be ever chanting the Name is itself the goal for the ideal devotee. He says, "I do not want anything else. If I get the privilege of chanting the Divine Name, of ever being immersed in Kirtan and Kirtan alone, I may be placed anywhere. I may be in heaven or in the nether world, I may be in bondage or I may be free. I may be in any condition, but provided I have the rare prerogative and privilege of ever being able to go on chanting the Divine Name, uttering Rama Rama or Krishna Krishna, I am blessed. That itself is quite enough for me. I do not seek anything further than this. The Name itself is my goal. The Name itself is my ideal and my highest desideratum." So, the Sankirtan Yoga is all in all and a comprehensive Yoga.

Sometimes a smile can be like a drop of water in a desert

This unique path Gurudev has placed before us for our taking the fullest advantage of. We have been under the influence of the silent vibrations of the continuous Akhanda Mahamantra Kirtan all these sixty years. And it is left to each one of us to take the fullest advantage in a more positive manner. No doubt in a negative way, even as a mother lovingly covers with a blanket her sleeping child—if at mid-night the weather suddenly turns cold, the mother out of her solicitude covers the child with a blanket so that it may not fall ill, the child does not know what the mother has done but it has been saved; this act of mercy, of grace, of protection, of shielding from harm, has been there all unconsciously—even so Gurudev has spread over us all this protective armour of Akhanda Mahamantra Kirtan. This holy shield is ever over us, and who knows, without our consciousness, our own awareness, a thousand times it might have safeguarded us from many a temptation, many a danger, many a harm, and it has always been safeguarding our Sadhana.

Once again I offer my crores of prostrations to God and Gurudev who have given us, poor Jivas saddled with weak bodies, steeped in countless sins of several births, who are saddled witl the burden of a mind that has been tinged with countless impure Vasanas and Vrittis of several births, so that we might be lifted up, this rare blessing of chanting of Akhanda Mahamantra Kirtan. All things and persons upon earth may fail you, but the Mahamantra will never fail you. The Mahamantra is the unfailing friend, guide and helper of you all. Therefore repeat this great Divine Mantra of sixteen Names regularly with full faith and devotion. Chant it with a concentrated mind. Chant it aloud or chant it silently, just as you like. Chant it alone or chant with many others, jus as you wish. All auspiciousness will be yours. All prosperity and happines will be yours. All success, material and spiritual will be yours. You will obtain wisdom, power, peace, plenty of joy and freedom.

✶

**Divine wisdom is to be got by devotion, meditation, and chastity**

# KUMBAKONAM - A SACRED ADYATMIC CENTRE AND A MOKSHAPURI

- Sivananda Muthuraman

In the present State of Tamil Nadu and in the interior South of Chennai, this sacred town and an Adyatmic Centre called as KUMBAKONAM is located. Before going into the brief history and mythology of Kumbakonam through this article, for the knowledge and benefit of the readers, I would like to reveal the sanctity of this holy Town, which I had come to know while studying the Sthala Mahatmiyam during my Childhood days.

In the Veda Kala the present Town of Kumbakonam was called as Bhaskara Kshetram. Besides many stories that tells about the sanctity of this sacred town Kumbakonam, hereunder I reproduce one Sanskrit Sloka in praise of this holy town, a Punya kshetram which exists in the shouth of Tamil Nadu:

**“Annya kshetre krutham paapam punya kshetre vinasyathi**
**Punya kshetre krutham paapam Varanaasyam vinasyathi**
**Varanasyam krutham paapam Kumbakone vinasyathi**
**Kumbakone krutham paapam Kumbakone vinasyathi”**

This means that –

1. A paapam (sin) committed in a place can be wiped off by visiting a holy place.

If a paapam is committed in a Holy place (Punya kshetram) then what will happen?

The answer is explained in the ibid Sloka.

2. Such a paapam can be wiped off by visiting the holy town Varanasi.

**To forget your troubles remember God**

Suppose in Varanasi a paapam is committed?

3. Such a paapam can be wiped off by visiting the holy town Kumbakonam.

Suppose in the holy town of Kumbakonam itself a paapam is committed?

4. Then that sin will be wiped off in the holy town Kumbakonam itself.

From the above Sloka, we find that the holy town KUMBAKONAM has been kept in a highly elevated place than the holy town KASI (Banaras). The real meaning is that - this word Kumbakonam represents a highly spiritualistic word exists from the Veda Kaalam (period), time immemorial.

**After the Maha Pralaya, the first khestra created by Brahma is this holy Town Kumbakonam, by the grace of Trimurthies, for which a separate incident had happened as per the Vedakala/ Puranic version.**

Legend says that Lord Siva himself emerged as LINGAM and was worshipped by the devotees as Adi Kumbeswara in this sacred town of Kumbakonam. His Consort being worshipped as Mangalambika. This is evident from the sankalpa made on any auspicious occasion saying "Mangalambika Sametha Sri Adi Kumbeswara".

Also another name to Goddess Mangalambika is Mantra Peeteswari. Lord Siva presented to His consort 36000 Cores mantra sakthi and in addition Goddess herself has another 36000 Cores mantra with her. Thus totally the Goddess is Athipathi to 72000 Crores Mantra. Hence the Goddess is also called as Mantra Peeteswari.

**(To be continued)**

**To age does not matter, but by taking on matters you will age**

# ధర్మం అమ్ముకొనే వస్తువు కాదు

**- ధర్మవీర**

అది పశ్చిమ బెంగాల్‌లోని క్రైందపూర్ అనే వూరు. ఆ వూరిలో నిమాయి అనే అబ్బాయి కాలికేదో వుండయింది. అది ఏ మందులకు లొంగలేదు. అక్కడికి దగ్గరగా ఉన్న మిషన్ ఆసుపత్రి ఫాదరీ సలహా మేరకు భాగల్‌పూర్‌లోని పెద్ద మిషన్ ఆసుపత్రిలో అబ్బాయిని చేర్పించారు నిమాయి తండ్రి.

ఆరేడు మాసాల చికిత్స అనంతరం పుండు పోయింది. నిమాయి ఆరోగ్యవంతుడై ఇంటికి వచ్చాడు. సలహా ఇచ్చి సిఫారుసు చేసిన ఫాదరీ నిమాయి తండ్రి దగ్గరికి వచ్చి చికిత్సకు ఆరువేల రూపాయలు చెలించాలన్నాడు.

ఇంత డబ్బు ఎలా అని అతననుకొంటున్నాడు. అతను నిరుపేద రైతు. నిమాయి క్రైస్తవం స్వీకరిస్తే డబ్బు కట్టాల్సిన అవసరం లేదన్నాడు ఫాదరీ.

ఫాదరీ దిక్కు ఎగాదిగా నిమాయి తండ్రి చూశాడు. ఉన్న పన్నెండు ఎకరాలలో ఆరెకరాలు అమ్మి అప్పటికప్పుడు ఆరు వేలు ఫాదరీ చేతికిచ్చాడు. "ధర్మం అమ్ముకొనే వస్తువు కాదు ఫాదరీ!" అని దండం పెట్టి మరీ పంపించాడు.

✶

**నీ జీవితం నువ్వు నడిచే దారిలాంటిది. నీకు తోడుగా నడిచే వాళ్ళుంటారు కానీ, నీకు బదులుగా నడిచేవాళ్ళు ఎవ్వరూ ఉండరు. ఎంత కష్టమైన నువ్వే నడవాలి.**

మనసులో కపటం లేకుండటమే గొప్ప ధర్మం

# జననం - మరణం

ఆంగ్లమూలం - స్వామి శివానంద　　　స్వేచ్ఛానువాదం - శ్రీవత్స

జనన మరణాలనే రెండు దశలు,
లోకం నాటకంలో మాయా దృశ్యాలు,
నిజానికి ఎవరూ పుట్టరు, ఎవరూ గిట్టరు,
ఎవరూరారు, ఎవరూ వెళ్ళరు.

లోకమంతా మాయాగారడి
మనసు ఆడుకునే ఆట,
బ్రహం మాత్రమే సత్యం,
దేహానికి మాత్రమే జననం.

పంచభూతాలు దేహానికి మూలం,
జనన మరణాలు లేనిది ఆత్మ,
స్థూల కోశాన్ని విసర్జించడమే మరణం,
సుషుప్తా వస్థలాంటిదే మరణం.

నిద్ర నుండి మేల్కోవడం జననం,
మరణానికి భయపడకు ఓ రామా !
జీవితం నిరంతరం సాగిపోతుంది,
పుష్పం వాడినా పరిమళం వెదజల్లుతుంది !

స్థూల దేహం నశించినా
శాశ్వతమైన ఆత్మ తేజస్సు తరగిపోదు,
నిజా నిజాలను వివేకంతో గ్రహించు,
జనన మరణాలు లేని అనంతం గురించి ఆలోచించు !

మాయా మోహం కతీతంగా ఎదుగు,
దేహంపై అనురాగం త్యజించు,
జనన మరణాల నుండి స్వేచ్ఛ పొందు,
శాశ్వత సారంలో విలీనమై పో !!!

**నవ్వుతూ చేసే చెడు పనుల ఫలితాలు - కష్టనష్టాలు**

## ప్రకటన

# ఆధ్యాత్మిక సాధకులకు సదవకాశము

"దివ్యజీవన సంఘము" నకు చెందిన "యోగ వేదాంత ఫారెస్టు అకాడమీ" **91**వ యోగ వేదాంత తరగతులను **1-03-2019** నుండి **29-04-2019**వ తేదీ వరకు రెండు మాసములకొరకు నిర్వహింపనున్నది. ఈ తరగతులు ఋషీకేశ్, శ్రీ శివానందాశ్రమ ప్రాంగణమునందు జరుగును. **20** నుండి **65** సంవత్సరముల మధ్య వయస్సుగల భారతీయ పురుషులకు ఈ తరగతులు స్థానికముగా నిర్వహింపబడును. ఈ తరగతులు ఆంగ్లభాషయందొసంగబడుటచే విద్యార్థులు పట్టభద్రులై ఆంగ్లభాషలో అనర్గళముగా మాట్లాడుట, చదువుట, వ్రాయుట తెలిసియుండవలయును. శిక్షణ, వసతి, భోజనములు ఉచితము. దరఖాస్తు ఫారములు ఇక్కడికి చేరవలసిన చివరి తేదీ **15-01-2019.** ఈ క్రింది అడ్రసు నుండి దరఖాస్తు ఫారము, శిక్షణ ప్రణాళికలను పొందవచ్చును. మఱియు **www.Sivananda online.org Website** నుండి కూడా పొందవచ్చును. **e-mail : yvfa @ dlshq.org.**

**Address :**
**The Registrar**
**The Yoga Vedanta**
**Forest Academy**
**Sivanandanagar - 249192**
**Tehri Garhwal District**
**(Uttarakhand)**

ఇట్లు
స్వామి యోగవేదాంతానంద
రిజిస్ట్రార్ - యోగ
వేదాంత ఫారెస్టు
అకాడమీ

నిజాయితీయే నిజమైన సంపద

# కార్తిక పూర్ణిమ సత్సంగ్ స్వామి శివానంద లైబ్రరి, హైదరాబాద్

నవంబర్ 22, 2018 తేదీన సాయంకాలం 4 గంటలకు స్వామి శివానంద లైబ్రరిలో, కార్తిక పూర్ణిమ సత్సంగ్‌ని భక్తులు ఎంతో ఉత్సాహంతో జరుపుకున్నాం. మొదటగ శ్రీ శివానంద ఆశ్రమ పద్ధతిలో ప్రార్థన జరిగినది. తదుపరి శ్రీ బ్రహ్మవైవర్త మహాపురాణంలోని శ్రీ రాధా మానస తంత్రములోని శ్రీ రాధికా సహస్రనామ స్తోత్రమును పఠించడం జరిగింది.

ముఖ్య అతిథిగ విచ్చేసిన శ్రీ ఆర్‌విజి కృష్ణమూర్తి గారు కార్తీక మాసాన్ని కౌమోది మాసమంటారని, ఉత్తరాదిన దేవదీపావళియని, కొన్ని ప్రాంతాలలో త్రిపుర పౌర్ణమిగ పూజలు చేస్తారని చెప్పారు. కార్తికమాసం అత్యంత పవిత్రమైనదని, మహిమాన్వితమైనదని, శివకేశవులకు ప్రీతికరమైన మాసమని అన్నారు. అన్ని దేవాలయాలలో భక్తులు లక్ష బిల్వార్చనలు, రుద్రాభిషేకాలు ఎంతో శ్రద్ధతో కావించి తమ అభీష్టాలను తీర్చుకుంటారని, మనస్సులో సంకల్పించుకొని ధ్యానిస్తూ అభిషేకం చేస్తే శివుడు ప్రీతి చెందుతాడని వివరించారు. శివార్చన చేసిన వారికి, శివగాయత్రి జపము చేసినవారికి గ్రహదోషాలు, ఈతి బాధలుండవన్నారు. తులసి దళాలతో శ్రీ మహావిష్ణువుని కార్తికమాసంలో పూజిస్తే ముక్తిదాయకమని, తులసి వనంలో శ్రీకృష్ణుని పూజించటం, విష్ణుసహస్రనామ పారాయణం, శివాభిషేకాలు చేయటం శ్రేష్టమని, కార్తికమాసంలో మంత్రదీక్షలు తీసుకున్న యెడల సత్ఫలితాలు కలుగుతాయని శ్రీ కృష్ణమూర్తి గారు వివరించారు.

కార్తికమాస విశేషాలు తెలుపుతూ, ప్రదోషకాలమునకు ఉన్న ప్రాముఖ్యతను కూడ తెలిపారు. అన్ని రోజులలో కలిగే ప్రదోషాలకన్నా, చతుర్థి, సప్తమి, త్రయోదశిలలో కలిగే ప్రదోషాలకు ఎక్కువ ప్రాముఖ్యమున్నదని చెప్తూ ప్రదోష కాలంలో శివునికే అధికారం కలదు కాన ఆ సమయంలో శివపూజలు మాత్రమే చేయాలని కొందరంటారని అన్నారు. కృష్ణ పక్ష త్రయోదశినాడు ఏర్పడే మహాప్రదోషకాలమున శివపూజకు ప్రాధాన్యత ఉన్నదన్నారు.

**నీ శత్రువు కన్నా నీ నిర్లక్ష్యమే నీకు ఎక్కువ కీడు చేస్తుంది**

త్రయోదశి ప్రదోష సమయాన, పరమశివుడు తన ప్రమదగణాలతో కొలువై ఉంటారని, మన పాపకర్మలను తీసివేసి మనలో సాత్విక గుణమును కలిగించి, మ కష్టనష్టాలను తొలగిస్తారని చెప్పారు.

శని త్రయోదశినాడు చేసే శివపూజవలన శని ప్రభావము తొలుగుతుంది. సోమప్రదోష సమయంలో చేసే శివపూజవల్ల త్రికరణశుద్ధి కలుగుతుంది. గురువారం త్రయోదశి ప్రదోషపూజవల్ల గురువు అనుగ్రహం కలిగి, విద్య, సంపద అభివృద్ధి చెందుతాయని వివరించారు.

కార్తికమాసంలో పంచాక్షరి మంత్రమైన "ఓం నమః శివాయః" ను శక్తిమేర జపించడం, శివాలయాలను, విష్ణ్వాలయాలను దర్శించటం కార్తిక పురాణాన్ని రోజుకో అధ్యయం చొప్పున పారాయణం, మంచి ఫలితాలనిస్తాయని అన్నారు. కార్తికమాసంలో దేవాలయాల్లో దీపాలంకరణ, జ్వాలా తోరణంకి ప్రదక్షిణలు, ఆకాశదీప దర్శనం, అరుణాచలంలో జ్యోతి దర్మనం, బృందావనంలో కార్తీక పూర్ణిమ నాడు గోవర్ధనగిరి ప్రదక్షిణం మొ॥ సత్కర్మల వల్ల జన్మరాహిత్యం కల్గుతుందని చెప్పారు. మార్కండేయపురాణ గ్రంథాన్ని దానం ఇవ్వటంవల్ల పౌండరీక యజ్ఞఫలం కల్గుతుందని అన్నారు. కార్తిక పూర్ణిమనాడు 14వ దైన భౌత్య మన్వంతరం ప్రారంభమవుతుందని తెలిపారు.

తర్వాత సత్సంగ్‌లో పాల్గొన్న శ్రీ చెరుకూరి సిద్దయ్యగారు రాధాస్వామి మార్గంలోని రెండు శబ్దాలను కీర్తన చేశారు.

శ్రీ వుప్పు రాఘవేంద్రగారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మనం పాటించే ఆచారాలు మనలోని అహంకారాన్ని తొలగిస్తాయని చెప్పారు. చివరగ ఆచార్య రమేష్, యోగ గురూజి శివకీర్తనలను గానం చేశారు. ఆధ్యాత్మిక చింతనాపరులు నిత్యం బ్రహ్మ ముహూర్తంలో లేచి యోగ, జప, ధ్యాన సాధనలు చేసి మంచి ఫలితాలని పొందాలని కోరారు.

*– ఎస్. వెంకటేశ్వరరావు*

**కృషికి తగిన ఫలితాలు తప్పకుండా ఉంటాయి. మనం చేయవలసిన దల్లా క్రమశిక్షణ, పట్టుదల, నిజాయితీలతో కష్టపడటమే**

**మనస్సాక్షి వద్దని చెప్పే పనులను ఎవరు చెప్పినా చేయకూడదు**

# శ్రీ శివానంద ఆశ్రమ వార్తలు

1) శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని యోగా బాలాజీ మందిరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి కల్యాణం జరుగును.

2) ప్రతి శని, ఆదివారాల్లో సాయంకాలం 6-00 గంటలకు స్వామి తత్త్వవిదానంద గారిచే భగవద్గీతపై ప్రవచనాలు జరుగుతున్నాయి.

3) తేది : 6-12-2018 న ఉదయం 10-00 గం॥ల నుండి మధ్యాహ్నం 2-00 వరకు శ్రీ పరమపూజ్య స్వామి సచ్చిదానంద మహారాజ్ (ఆనంద ఆశ్రమము, కేరళ) గారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా శ్రీ పూజ్య స్వామి ముక్తానంద్‌జి మహారాజ్ గారు మరియు శ్రీ చంద్రానంద మాతాజీ ఆధ్వర్యంలో లలితా పారాయణము, శ్రీరామ్ జై రామ్ నామ భజన జరిగింది.

4) తేది : 9-12-2018 నాడు మధ్యాహ్నం శ్రీ జి. సుధీర్ కుమార్ గారు పరివార సమేతంగా విచ్చేసి పడిపూజ నిర్వహించారు. దాదాపు 150 మందికి మహాప్రసాద వితరణ జరిగింది.

**ప్రతి నెల బుధవారం రోజు**

**ఉచిత సంస్కృత**

**క్లాసులు సా॥ 6 గం॥ల నుండి**

**8.00 గం॥ల వరకు జరుగుతున్నాయి.**

**రండి! సంస్కృతం నేర్చుకోండి!**

**సంస్కార భారతాన్ని నిర్మించండి!**

తియ్యని మాటలే కాదు - తియ్యని మనసు కూడా ఉండాలి

విశేష భారతి

శ్రీ విళంబి పుష్య శుద్ధ చతుర్దశి నుండి
మాఘ బహుళ పూర్ణిమ వరకు

# 2019 జనవరి

01-01-2019 ఆంగ్ల సంవత్సరాది

04-01-2019 మాసశివరాత్రి

05-01-2019 అమావాస్య, పితృతర్పణం

12-01-2019 స్వామి వివేకానంద జయంతి

14-01-2019 భోగి

15-01-2019 మకరసంక్రాంతి ఉత్తరాయణ పుణ్యకాలం

16-01-2019 కనుమ పండుగ

17-01-2019 సర్వేషాం ఏకాదశి

19-01-2019 శనిత్రయోదశి

22-01-2019 శ్రీ పంచమి

23-01-2019 నేతాజీ జయంతి

24-01-2019 సంకటహర చతుర్థి

25-01-2019 శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన

26-01-2019 గణతంత్రదినోత్సవం


30-01-2019 గాంధీ వర్ధంతి

**అసత్యంతో సాధించిన విజయం కంటే సత్య మార్గంలో నడిచినా పొందిన ఓటమి గొప్పది**

**Printed and Published by G. SUDHIR KUMAR on behalf of A.P. DIVINE LIFE SOCIETY, Printed at Natural Gray Offset Press, # 10-2-11/1, Opp. IDBI Quarters, I.T. Towers Road, AC Guards, Hyderabad - 500004, Published at A.P. DIVINE LIFE SOCIETY SIVANANDA ASHRAM 6-1-110, Padmaraonagar,** Secunderabad - 500 025 **Editor Acharya Kasireddy Venkat Reddy.**
Tel : 040-27503274

**కర్తవ్య పరాయణులు కష్టనష్టాలు లెక్కచేయరు**

వేమన వేదాంతం



# పరమాత్మ దర్శనం

**వెదకి కొనలేరు వేదాంత వేద్యుని**
**ఉత్తముండె కాంచు నుర్విమీద**
**కలిగె నేనతనిని కానంగ లేరయా !**
**విశ్వదాభిరామ వినురవేమ ! (వే. ప : 86)**

**అర్థం :** వేదాంత = వేదాంతంచేత ; వేద్యుని = తెలియదగిన ఆ భగవంతుని ; ఉర్విమీద = ఈ భూమిమీద ; ఉత్తముండె కాంచు = ఉత్తముడైన వాడు మాత్రమే చూడగలుగుతాడు ; ఉర్విమీద = ఈ భూమి మీద (ఆ భగవంతుడు) కలిగెను + ఏని = ఉన్నట్లయితే ; అతనిని = ఆ దేవుణ్ణి ; కానంగలేరు + అయా = చూడలేరుకదా !

**భావం :** వేదాంతంచేత మాత్రమే తెలుసుకోదగిన భగవంతుణ్ణి వేదాంతం తెలిసిన జ్ఞానిమాత్రమే తెలుసుకోగలుగుతాడు. ఒకవేళ ఉన్నా గాని ఆ భగవంతుణ్ణి ఈ భూమి మీద కనుగోలేరు.

**వ్యాఖ్య :** భగవంతుడంతటా ఉన్నాడు. ఇందు గలడందులేదని సందేహము వలదని, ఎందెందు వెదకితే అందందే కలడని ప్రహ్లాదుడున్నాడు తండ్రితో. అయితే అంతటా ఉన్న ఆ దేవదేవుణ్ణి తెలుసుకోవాలంటే వేదాంత వేద్యుడవు కావాలని యోగి వేమన అంటున్నారు. ఉపనిషత్తులు వేదాంతాలు. ఉపనిషత్తుల్లో తనను తాను తెలిసికొంటే ఆత్మజ్ఞానం అని ఉంది. ఆత్మజ్ఞానమే బ్రహ్మజ్ఞానం. అంటే బ్రహ్మ వేత్తలే భగవంతుణ్ణి తెలుసుకొంటారని అర్థం.

అయితే భూమ్మీద కాదు తెలుసుకొనేది ! ఉర్వి మీద కలిగేనేని అతణ్ణి కానంగ లేరంటారు యోగి వేమన. నిరాకారుడు, నిర్గుణుడు అయిన భగవంతుణ్ణి కనుగొనేదెలా ! ఆత్మలోని పరమాత్మను ఆత్మజ్ఞాని మాత్రమే దర్శించగలుగుతాడని వేదాంత వేద్యుడైన యోగి వేమన అంటున్నారు. మనం సాక్షాత్కారం (రియలైజ్) అనే మాటవింటుంటాం. ఆ సాక్షాత్కారం బయట ఎక్కడో జరుగదు. హృదయంలోనే జరుగుతుందని గ్రహిస్తే దర్శనమంటే ఏమిటో సులభంగా అర్థమవుతుంది.

– *ఆచార్య కసిరెడ్డి*

*Date of Publication : 23.12.2018 - Posted pm 26, 27th*

***LICENCE NO. H/SD/ 517 /18-20 DT. 12.03.2018***

***RNI No. TELBIL/2002/08571***

***SIVANANDA BHARATHI (MONTHLY)***

## మంచి శ్లోకం

**శ్రమయే జీవితం**

**శ్లో॥ వార్ధకం వయసా నాస్తి మనసా నైవ తద్భవేత్ ।**
**సంతతో ద్యమశీలస్య నాస్తి వార్ధక పీడనమ్ ॥**

**<u>భావం</u> :** ముసలితనం వయసులో లేదు, మనసులోనూ ఉండకూడదు. ఎప్పుడూ పనిచేసుకొనే వానికి ముసలితనం ఉండదు.

## మంచి పద్యం

**దేవుడొక్కడే**

**జాతినీతి వేఱు జన్మంబదొక్కటి**
**అరయ తిండ్లు వేఱె యౌనుగాక**
**దర్శనములు వేఱు దైవమౌనొక్కటి**
**విశ్వదాభిరామ వినుర వేమ !**

**భావం :** జాతి లేదా కులాలకు నడవడిలో భేదాలుండవచ్చు ; కాని అందరి జన్మ ఒకటే. వారు తీసుకొనే తిండి పదార్థాలు వేరే కావచ్చు. అదే విధంగా దైవాన్ని వేర్వేరు రూపాల్లో దర్శించవచ్చు. కాని దేవుడొక్కడే !

***Book - Post (Printed Matter)***

***To***

______________________________

______________________________

______________________________

______________________________

***Printed and Published by***
***G. SUDHIR KUMAR on behalf of A.P. DIVINE LIFE SOCIETY,***
***Printed at Natural Gray Offset Press, # 10-2-11/1, Opp. IDBI Quarters,***
***I.T. Towers Road, AC Guards, Hyderabad - 500004,***
***Published at : A.P. DIVINE LIFE SOCIETY SIVANANDA ASHRAM***
***6-1-110, Padmaraonagar,*** Secunderabad - 500 025.
**Email : apdlssec@gmail.com, website : http://apdls.yolasite.com**
***Editor : Acharya Kasireddy Venkat Reddy.***
Tel : 040-27503274